శనివారం
19-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 207
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రోహిత్ వేముల పేరిట చట్టం: రాహుల్

న్యూఢిల్లీ: విద్యా వ్యవస్థలో కుల వివక్షను నిర్మూలించేందుకు రోహిత్ వేముల పేరుతో చట్టాన్ని రూపొందించాలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు. ఈ మేరకు ఆయన ఓ లేఖ రాశారు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. తన జీవిత కాలంలో బీఆర్ అంబేద్కర్ కూడా కుల వివక్ష ఎదుర్కొన్నారని లేఖలో రాహుల్ పేర్కొన్నారు. తమ వద్ద ఆహారం ఉన్నా... అంటరానివాళ్లని నీళ్లు ఎవరూ ఇవ్వలేదని, దీంతో తిండి తినలేకపోయినట్లు అంబేద్కర్

- మిగతా 2 లో

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ: భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది. ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీనిపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన విషయ మని అన్నారు. 'భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటి వరకు మన దేశం నుంచి 14 శాసనాలు

- మిగతా 2 లో

ఈపీఎఫ్ఓ 3.0తో సేవలు సులభతరం

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో డిజిటల్‌గా కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈపీఎఫ్ఓ 3.0తో 9 కోట్ల మంది చందాదారులకు ప్రయోజనం చేకూరనుందని వివరించారు. మే లేదా జూన్‌కల్లా కొత్త వెర్షన్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రముఖ వార్తా సంస్థ 'పీటీఐ'కిచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు పంచుకున్నారు. ఈపీఎఫ్ఓ వెర్షన్ 3.0తో సేవలు మరింత

- మిగతా 2 లో

రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

ధన్కర్ వ్యాఖ్యలపై రాజా ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలను గవర్నర్లు అణగదొక్కుతున్నారని, గవర్నర్ల వ్యవస్థను బీజేపీ-ఆర్ఎస్ఎస్ దుర్వినియోగం చేస్తున్నాయని, దీనికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వంతపాడటం దురదృష్టకరమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. రాష్ట్రపతి, గవర్నర్ల రాజ్యాంగబద్ధ బాధ్యతలను నిర్దేశించే సుప్రీంకోర్టు అధికారాన్ని ప్రశ్నించేలా ధన్కర్ మాట్లాడటాన్ని సీపీఐ ఖండిస్తోందని రాజా 'ఎక్స్'లో పేర్కొన్నారు. మన రాజకీయ వ్యవస్థలో రాజ్యాంగమే సర్వోన్నతమని రాజా నొక్కిచెప్పారు. రాజ్యాంగానికి మించిన ఏ పదవీ లేదని అన్నారు. ప్రజాస్వామ్యంలో 'చెక్స్ & బ్యాలెన్స్' (రాజకీయ వ్యవస్థలో అధికారాన్ని పంపిణీ చేసే పద్ధతి) అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను గవర్నర్లు తమ వద్ద పెండింగ్‌లో పెట్టుకోవడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, సుదీర్ఘకాలం బిల్లులు పెండింగ్‌లో ఉండకుండా సుప్రీంకోర్టు న్యాయపరంగా మార్గం సుగమం చేసిందని రాజా తెలిపారు. మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి నడుచుకోవాలని అధికరణ 74(1) స్పష్టం చేస్తుందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రాష్ట్రపతి ఇలాంటి విషయాల్లో సొంతంగా నిర్ణయాలు తీసుకోరని, ఉప రాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాల అణచివేతకు గవర్నర్ వ్యవస్థను ఆర్ఎస్ఎస్-బీజేపీ దుర్వినియోగించడాన్ని చట్టబద్ధంగా సమర్థించేవిగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదకర ధోరణి ఇటీవల పెరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. 'తొలి గిరిజన మహిళా రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము రాజ్యాంగబద్ధ అత్యున్నత స్థానం చేపట్టారు. ఈ స్థానం సమాఖ్యస్ఫూర్తికి విఘాతం కలిగించే వివక్షపూరిత ప్రణాళికలకు ముసుగుగా వినియోగించుకోవడం ఆందోళనకరం. జడ్జి ఇంటి నుంచి భారీగా నగదు లభ్యం కావడం వంటి ఘటనలు దర్యాప్తు, దిద్దుబాటు చర్యల అవసరాన్ని సూచిస్తున్నాయి. ఇటువంటి కేసులతో న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగించే అజెండా బహిర్గతమవుతోంది' అని రాజా అన్నారు. సీపీఐ సహా 55 మంది పార్లమెంటు సభ్యులు తీర్మానం ప్రవేశపెట్టి... అలహాబాద్ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి చేసిన మతతత్వ, విభజన వ్యాఖ్యలపై రాజ్యసభలో చర్చను కోరితే... చైర్మన్ స్థానంలో ఉన్న ఉప రాష్ట్రపతి అందుకు అనుమతించలేదని రాజా గుర్తుచేశారు. న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపత్తి-స్వాతంత్ర్యాన్ని, సమాఖ్యవాదాన్ని బలహీనపర్చడానికి, నిరంకుశ పాలకుల చేతిలో అధికారాన్ని కేంద్రీకరించే ప్రమాదకరమైన వ్యూహానికి ఇలాంటి చర్యలు దారితీస్తాయని సీపీఐ హెచ్చరిస్తోందన్నారు.

ఎన్‌టీటీ డేటా, నెయిసాతో
రూ.10,500 కోట్ల ఒప్పందం

- హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో నుంచి ఎంతో నేర్చుకున్నా
- ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి రూ.10,500 కోట్ల పెట్టుబడితో ఈ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు త్రైపాక్షిక ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీటీ డేటా, నెయిసా నెట్‌వర్క్స్ నుంచి బోర్డు సభ్యుడు కెన్ కట్సుయామా, డైరెక్టర్ తడావోకి నిషిమురా, ఎన్టీటీ గ్లోబల్ డేటా సెంటర్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ బజ్‌పాయ్, నెయిసా సీఈవో, ఎన్టీటీ గ్లోబల్ డేటా ఛైర్మన్ షరద్ సంఘ్వీ ఈ ఒప్పందంలో ఉన్నారు. హైదరాబాద్‌లో నిర్మించబోయే 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్ 25,000 జీపీయూలతో దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం. ఎన్‌టీటీ డేటా, నెయిసా కంపెనీలు సంయుక్తంగా ఏఐ-ఫస్ట్ సొల్యూషన్ అభివృద్ధి చేసేందుకు ఈ క్లస్టర్ కొత్త ఆవిష్కరణల కేంద్రంగా అందరి దృష్టిని ఆకర్షించనుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వహిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంభిస్తారు. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఈఎస్‌జీ ప్రమాణాలతో అభివృద్ధి

- మిగతా 2 లో

'భూభారతి'తో సమస్యలకు పరిష్కారం

- పార్ట్- బీలో ఏడు లక్షల ఎకరాలకు మోక్షం
- అబాదీ ఇళ్లకు డాక్యుమెంట్లు...
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ
- పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో-ములుగుజిల్లా: పేదవాడి కన్నీటిని తుడవటానికే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్‌లో భూభారతి పైలెట్ ప్రాజెక్టును శుక్రవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఎంపీ బలరాం నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఫైనాన్స్) రామకృష్ణారావు, ఎమ్మెల్యేలు గండ్ర

- మిగతా 2 లో

మోదీ అప్రజాస్వామిక విధానాలు
తిప్పికొడదాం

చట్టాలు మార్చి కార్మికుల శ్రమ దోపిడీకి యత్నం
మేడే స్ఫూర్తితో ఆందోళనకు సిద్ధంకండి: కూనంనేని

విశాలాంధ్ర - హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ... చట్టాలను మార్చి బడా పారిశ్రామికవేత్తలకు కార్మికుల శ్రమను దోచి పెట్టేందుకు యత్నిస్తుం దని, అందులో భాగంగానే ఎనిమిది గంటల పని విధానాన్ని మార్పుచేసి 12 గంటల వరకు పని చేసుకోవచ్చు అని చట్టంలో మార్పులు తీసుకురావడం నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హిమాయత్ నగర్‌లోని

- మిగతా 2 లో

రాజ్యసభ అంటే భూపేశ్

కొన్ని వ్యవస్థలను గుర్తు చేసుకుంటే దానికి ప్రతీకగా కొందరు వ్యక్తులే గుర్తుకొస్తారు. సీపీఐ నాయకుడు భూపేశ్ గుప్తా సరిగ్గా అలాంటి వారే. రాజ్యసభ అనగానే భూపేశ్ గుప్తా గుర్తు రాకుండా ఉండరు. రాజ్యసభకు సంబంధించినంత మేరకు ఆయన రాజ్యసభ చరిత్రే. రాజ్యసభ ఏర్పడినప్పటి నుంచి తాను మరణించేదాకా భూపేశ్ ఆ సభ సభ్యుడిగానే ఉన్నారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ఇదీ లోకం!

ఏమండీ అలా షాపుల కెళ్లి 'బంగారం' చూసొద్దాం పదండీ!

మీ విముక్తి... మన స్వాతంత్ర్యమే ధ్యేయం

- పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ
- 'ప్రిజనర్స్ డే'న 9 వేల మంది ఖైదీలకు సంఘీభావం

జెరూసలేం: 'మీ (పలస్తీనా ఖైదీలు) విముక్తి.... మన (పలస్తీనా ప్రజలు) స్వాతంత్ర్యమే ధ్యేయంగా ముందుకెళుతున్నామంటూ ప్రిజనర్స్ డేను పురస్కరించుకొని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటన చేసింది. ఇజ్రాయిల్ దురాక్రమణ క్రమంలో యూద దేశం నిర్బంధించిన తొమ్మిది వేల మందికిపైగా పలస్తీనా ఖైదీలకు సంఘీభావం ప్రకటించింది. అమానవీయ పరిస్థితుల్లో వేధింపులు, నిర్లక్ష్యాన్ని గురై ప్రాణాలు కోల్పోతున్న ఖైదీల దుస్థితిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది. ఇన్ని ఘోరాలు జరుగుతున్నా అంతర్జాతీయ సమానం మౌనం వీడకపోవడాన్ని ఆక్షేపించింది. మానవతా సంఘాలు ఇప్పటికైనా స్పందించి పలస్తీనా పౌరుల హక్కులు, స్వాతంత్ర్యం, స్వయంప్రతిపత్తి, ఔన్నత్యాన్ని కాపాడటానికి ముందుకు రావాలని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. మన మాతృభూమి ఔన్నత్యాన్ని, మన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం, కిరాకత్వాన్ని, అవమానాలను, అణచివేతను ఎదిరించడం కోసం దురాక్రమణదారుల నిర్బంధానికి గురైన పురుషులు, మహిళలు సహా తొమ్మిది వేల మందికిపైగా పలస్తీనా ఖైదీల నిబద్ధతకు సంఘీభావం తెలుపుతున్నామని 'పలస్తీనియన్ ప్రిజనర్స్ డే' ప్రకటనలో కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. 'గాజా, వెస్ట్‌బ్యాంక్, జెరూసలేంలో ఇజ్రాయిల్ దురాక్రమణ, వైమానిక, భూతల దాడులు, వేధింపుల నడుమ ప్రిజనర్స్ డే జరుపుకుంటున్నాం. పలస్తీనా ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. ఆకలి చావులకు దారితీస్తూ వినాశనం సృష్టిస్తున్నారు. సామూహిక నిర్బంధ కాండ కొనసాగిస్తున్నారు. ఖైదీలుగా ఉన్న మన వాళ్ల హక్కులు హరిస్తూ... శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు. వారి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. పౌష్టికాహారం లేక వారు నీరసించిపోతుంటే చూసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. విచారణకు తావు లేకుండా దశాబ్దాల పాటు జైళ్లకు పరిమితం చేస్తున్నారు. వందల సంవత్సరాల శిక్షలు విధిస్తూ వేధిస్తున్నారు. అమానవీయ పరిస్థితుల్లో గత ఏడాదిలో 70 మంది చనిపోయారు. ముఖ్యంగా గాజాపై ఇజ్రాయిల్ మారణహోమం మొదలైనప్పటి నుంచి పరిస్థితి మరీ దారుణంగా మారింది' అని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. ఖైదీల విడుదలకు డిమాండ్ చేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, మానవతా సంస్థలు ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ తక్షణమే జోక్యం చేసుకొని సామూహిక అరెస్టులు, నిర్బంధ కాండ, వేధింపుల నుంచి ఖైదీలకు విముక్తి కల్పించాలని పిలుపునిచ్చింది.'ఖైదీలకు విముక్తి, అమరులకు గౌరవం, ప్రజా ఉద్యమాల్లో విజయమే లక్ష్యమంటూ సంకల్పించింది. పలస్తీనా ప్రజల పోరాటం వర్ధిల్లాలి, పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ, శ్రామిక వర్గ గళం-తిరుగుబాటు వర్ధిల్లాలని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ నినదాలిచ్చింది.

త్వరలో చైనాతో వాణిజ్య ఒప్పందం: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా-చైనా మధ్య సుంకాల యుద్ధం తీవ్రతరమవుతూ వాణిజ్య యుద్ధానికి దారితీస్తున్న పరిస్థితుల్లో ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాతో మరో మూడు లేక నాలుగు వారాల్లో వాణిజ్య ఒప్పందం ఖరారు కాబోతోందని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. 'వచ్చే మూడు లేక నాలుగు వారాల్లో చైనాతో వాణిజ్య ఒప్పందం జరుగుతుంది. ఇదంతా త్వరలోనే పూర్తవుతుంది' అని శ్వేతసౌధం వద్ద విలేకరులతో మాట్లాడిన ట్రంప్ అన్నారు. చైనాతో చాలా మంచి వాణిజ్య ఒప్పందం జరగబోతోందని వెల్లడించింది. అమెరికా ప్రతీకార సుంకాలపై అనేక ఆసియా దేశాలు ఇప్పటికే సంప్రదింపులు మొదలు పెట్టాయి. కొన్ని దేశాలకు మినహాయింపులు ఇచ్చేందుకు అమెరికా ఒప్పుకుంది. కొంత కాలం విరామాన్ని కూడా ప్రకటించింది. అయితే చైనాకు ఎలాంటి ఊరటనివ్వకపోగా ఆ దేశ ఉత్పత్తులపై ఏకంగా 245 సుంకాన్ని ప్రకటించింది. ఈ పరిణామాల క్రమంలో వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోనున్నట్లు ట్రంప్ చెప్పడం చర్చకు దారితీసింది.

యుద్ధం ఆపకపోతే సాయం ఆపేస్తాం... ఉక్రెయిన్‌కు హెచ్చరిక

యుద్ధం ముగించకపోతే ఇక మీ దేశాన్ని పట్టించుకోమని ఉక్రెయిన్‌ను అమెరికా హెచ్చరించింది. పశ్చిమాసియాకు ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో కలిసి యూరప్, ఉక్రెయిన్ నాయకులతో భేటీ అయిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇది మా యుద్ధం కాదు. మూడేళ్ల నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేస్తోంది. ఇకపై సాయాన్ని ఆపేయాలని భావిస్తున్నాం. యుద్ధం ఆపలేని పరిస్థితుల్లో ఉక్రెయిన్ గురించి పట్టించుకోవడం మానేసి అమెరికా తన దారిని తాను చూసుకుంటుంది' అని రుబియో వెల్లడించారు.

పోర్టులపై తప్పుడు విధానాలు ఆపండి

అధిక చార్జీలతో అందరికి నష్టం: అమెరికాకు చైనా స్పష్టీకరణ

బీజింగ్: అమెరికా పోర్టులను సందర్శించే చైనా సంబంధిత నౌకలపై భారీ రుసుము వసూలు చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమైంది. తాజా చర్యలను బీజింగ్ తీవ్రంగా ఆక్షేపించింది. పోర్టులపై తప్పుడు విధానాలు ఆపాలంటూ అమెరికాకు స్పష్టంచేసింది. భారీగా చార్జీలు విధించడంతో అన్ని వర్గాలకు నష్టం జరుగుతుందని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ శుక్రవారం తేల్చిచెప్పారు. 'అంతర్జాతీయ షిప్పింగ్ వ్యయం అమాంతం పెంచేశారు. ఇది అంతర్జాతీయ ఉత్పత్తి, సరఫరా గొలుసుల సుస్థిరతను దెబ్బతీస్తుంది. ఈ పద్ధతిలో అమెరికా నౌకల తయారీ పరిశ్రమను పునరుద్ధరించలేరు' అని ఆయనన్నారు. పద్ధతి మార్చుకోవాలని... వాస్తవాలను, బహుపాక్షిక నిబంధనలను గౌరవించాలని అమెరికాను కోరారు. తప్పుడు విధానాలను తక్షణమే ఆపేయాలన్నారు. చైనా తన న్యాయపరమైన హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించుకోవడం కోసం అవసరమైన చర్యలన్నీ తీసుకుంటుందని స్పష్టంచేశారు. చైనాలో తయారైన, ఆ దేశానికి చెందిన నౌకలు అమెరికా పోర్టుల్లో డాక్ అయితే వాటిలోని మొత్తం సరుకుపై భారీగా చార్జీలు వసూలు చేస్తామని అమెరికా వాణిజ్య ప్రతినిధి గురువారం వెల్లడించారు.

ప్రధాని చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: హెచ్‌సీయూలో జరిగిన పర్యావరణ విధ్వంసంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన బాధ్యతల విషయంలో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన ప్రధాని మోదీని ఉద్దేశించి పోస్ట్ పెట్టారు. కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టి కాంగ్రెస్ బీజేపీ కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి చేసిన విధ్వంసంపై ప్రధాన మంత్రి మాట్లాడింది కేవలం బూటకం కాకుంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి అంశం కేవలం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసంగా పేర్కొన్నారు. ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐ, ఆర్‌బీఐ, సెబీ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ సంస్థలకు ఆధారాలతో సహా కాంగ్రెస్ చేసిన రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసం గురించి తెలియజేశామని కేటీఆర్ వివరించారు. సుప్రీం కోర్టు పంపించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కూడా ఈ అంశంలో ఆర్థిక అవకతవకలు జరిగిన అంశాన్ని నిర్ధారించిందని ఆయన గుర్తు చేశారు. అయితే నిసిగ్గుగా, అక్రమంగా వ్యవస్థలను మోసం చేసి పర్యావరణ విధ్వంసం చేసిన రేవంత్ రెడ్డి లాంటి నాయకులను ప్రజల ముందు నిలబెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. కంచ గచ్చిబౌలిలో చేసిన రూ.10 వేల కోట్ల అక్రమాలపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

రోహిత్ వేముల పేరిట చట్టం

(మొదటిపేజీ తరువాయి)

స్టోరీని రాహుల్ గుర్తు చేశారు. అంబేద్కర్ పాఠశాలలో తన అనుభవం గురించి చెబతూ... 'నేను అంటరానివాడిని అని నాకు తెలుసు. అంటరానివారు కొన్ని అవమానాలు, వివక్షలకు గురయ్యారు. ఉదాహరణకు పాఠశాలలో నా ర్యాంకు ప్రకారం నా క్లాస్‌మేట్స్ మధ్యలో కూర్చోలేనని నాకు తెలుసు. కానీ నేను ఒక మూలలో ఒంటరిగా కూర్చోవాల్సి వచ్చింది' అని గాంధీ అంబేద్కర్‌ను ఉటంకిస్తూ అన్నారు. తన అభ్యర్థనను కర్నాటక సీఎం సిద్దరామయ్య అంగీకరిస్తారని, అంబేద్కర్ ఎదుర్కొన్న అవమానాలు దేశానికే సిగ్గు చేటని, దేశంలో మరో విద్యార్థి అలాంటి బాధకు గురికాకూడదని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యా వ్యవస్థలో ఇప్పటికీ వివక్ష ఎదుర్కోడం సిగ్గుచేటు అని రాహుల్ తెలిపారు. దీనికి ముగింపు పలకాలని, అంబేద్కర్ లాంటి పరిస్థితిని ఎవరూ ఎదుర్కోకుండా ఉండేందుకు రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించాలని కర్నాటక ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు రాహుల్ తెలిపారు. ఏప్రిల్ 16వ తేదీన ఆ లేఖ రాశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న రోహిత్ వేముల 2016లో కుల వివక్ష తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా 'ఎక్స్'లో తనలేఖను పోస్టు చేసిన రాహుల్ గాంధీ... 'ఇటీవల నేను పార్లమెంటులో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాల విద్యార్థులు, ఉపాధ్యాయులను కలిశాను.ఈ సందర్భంగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో కుల వివక్షను ఎలా ఎదుర్కోవాలో వారు నాకు చెప్పారు' అన్నారు. అణగారినవారు కూడా సాధికారత పొందేందుకు, కుల వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి విద్య మాత్రమే ఏకైక మార్గమని అంబేద్కర్ నిరూపించారని రాహుల్ అన్నారు. కానీ దశాబ్దాల తర్వాత కూడా, మన విద్యా వ్యవస్థలో లక్షలాది మంది విద్యార్థులు కుల వివక్షను ఎదుర్కొంటున్నారని... ఇది చాలా దురదృష్టకరం అని ఆయన అన్నారు.

ఈపీఎఫ్ఓ 3.0తో సేవలు సులభతరం

(మొదటిపేజీ తరువాయి)

సులభతరం కానున్నాయని చెప్పారు. ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు, డిజిటల్ కరెక్షన్లు, ఏటీఎం ద్వారా విత్‌డ్రా వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈపీఎఫ్ఓను మరింత సౌకర్యంగా, సమర్థంగా తీర్చిదిద్దడమే ఈ మార్పుల వెనుక ముఖ్య ఉద్దేశమని వివరించారు. క్లెయిమ్‌లు, కరెక్షన్ల కోసం ఫారాలు నింపడం, కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందులు ఈ కొత్త వెర్షన్‌తో తొలగబోతున్నాయని మాండవీయ తెలిపారు. వేగవంతమైన సెటిల్‌మెంట్ల వల్ల డబ్బులు వారి వారి బ్యాంక్ ఖాతాల్లో త్వరగా జమవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 27 లక్షల కోట్ల విలువైన నగదు నిల్వలను ఈపీఎఫ్ఓ కలిగి ఉందని, ఈ మొత్తానికి ప్రభుత్వ హామీతో పాటు 8.25 శాతం వడ్డీ అందిస్తోందని చెప్పారు. సెంట్రలైజ్డ్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ వల్ల ఇప్పటికే దేశంలోని ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్ పొందే వెసులుబాటు కల్పించామని, దీనివల్ల 78 లక్షల మందికి ప్రయోజనం కలుగుతోందని వివరించారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ బీమా యోజన, శ్రామిక్ జన్‌ధన్ యోజన వంటి పెన్షన్ పథకాలన్నింటినీ ఏకీకృతం చేసి... పెన్షన్ కవరేజీని క్రమబద్ధీకరించడం, బలోపేతం చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందన్నారు.

ఎన్‌కౌంటర్లు... లొంగుబాట్లు

- ఇద్దరు మావోయిస్టుల కాల్చివేత?
- 33 మంది భద్రతా బలగాల ముందుకు...

విశాలాంధ్ర-చింతూరు:

చత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు... లొంగుబాట్ల పర్వం కొనసాగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో భద్రతా బలగాలు మావోయిస్టులను కాల్చిచంపుతున్నాయి. మరోవైపు, శుక్రవారం నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందినట్లు వార్తలు రాగా... పోలీసు అధికారుల ముందు 33 మంది మావోయిస్టులు లొంగిపోయారు. నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు వర్గాల సమాచారం. ఘటన స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కోహ్కామెటా పోలీస్ స్టేషన్ పరిధిలోని కసోద్ - కుమురాడి అడవిలో భద్రతాబలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అయితే, ఈ కాల్పుల నుంచి మావోయిస్టులు తృటిలో తప్పించుకున్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ పోలీసులు మాత్రం కొంతమంది చనిపోయినట్లు చెబుతున్నారు. ఎదురుకాల్పుల తర్వాత సంఘటనాస్థలాన్ని పరిశీలించగా రూ.6 లక్షల నగదు, 11 ల్యాప్‌టాలు, 50 కిలోల గన్‌పౌండర్, 20 లీటర్ల పెట్రోలు, రెండు ప్రెషర్ కుక్కర్ బాంబులతోపాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు, మందులు లభించాయి. ఇటీవల కాలంలో ఆపరేషన్ కగార్ దూకుడుగా ఉంది. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ శాంతిచర్చలకు సిద్ధమని లేఖ విడుదల చేసినప్పటికీ అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు చత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ స్పందించ లేదు. వరుసగా ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయి. భద్రతాబలగాలు మావోయిస్టులు ఉన్న ప్రాంతాన్ని జల్లెడపడుతున్నాయి. మావోయిస్టులు తారసపడిన వెంటనే కాల్పులకు తెగబడుతున్నాయి. మావోయిస్టు అగ్రనేతలు భద్రతాబలగాల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోతున్నారు. ఇటు తెలంగాణ ప్రభుత్వం వద్ద, అటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వద్ద దళాలు లొంగిపోతున్నారు.

33 మంది మావోయిస్టుల లొంగుబాటు

చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 33 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వారిలో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. మావోయిస్టుల భావజాలం నచ్చకపోవడం, స్థానిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో నిరాశ చెందామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా 13 మంది మావోయిస్టులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపో యారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా పలు హింసాత్మక, విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నారని చెప్పారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు మిలిటరీ డిప్యూటీ కమాండర్ ముచాకి జోగా, స్క్వాడ్ సభ్యురాలు... అతని భార్య ముచాకి జోగి ఉన్నారని, వీరిపై రూ.8 లక్షల రివార్డు ఉందని వెల్లడించారు. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు దేవే, దుధి బుద్రాలపై రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉందన్నారు. మరో ఏడుగురు కార్యకర్తలపై రూ.2 లక్షల రివార్డు, ఒకరిపై రూ.50 వేల రివార్డు ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ రూ.50 వేల చొప్పున సాయం అందించామని, ప్రభుత్వ పునరావాస పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. కాగా బడేసట్టి గ్రామంలో మరో 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. గతేడాది సుక్మా సహా బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.

మోదీ అప్రజాస్వామిక విధానాలు తిప్పికొడదాం

(మొదటిపేజీ తరువాయి)

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర సమితి రూపొందించిన మేడే పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షులు కే.ఏసు రత్నం, కార్యదర్శి ఎస్.విలాస్, కార్యవర్గ సభ్యులు తోట రామాంజ నేయులతో కలిసి ఆవిష్కరించారు. కూనంనేని మాట్లాడుతూ భారతదేశం ఎప్పుడూ లేనంతగా బలహీన పడిందని దానికి మోదీ ప్రభుత్వ విధానాలే కారణమని అన్నారు. భారత వ్యవస్థను ప్రతిష్టపరిచి, కార్మికవర్గ చైతన్యాన్ని పెంపొందించి కార్మిక హక్కుల్ని సాధించుకోవడానికి మేడే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగిపోతున్నా మోదీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ధరలకు అనుగుణంగా కార్మిక వర్గం జీవించే విధంగా ఉపాధి కల్పించే పారిశ్రామిక సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మోదీ పాలనలో ప్రభుత్వ సంస్థలను మూసివేస్తున్నారని, అనేక ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటు గుప్త పెట్టుబడిదారులకు తెగనమ్మేందుకు మోదీ మోదీ ప్రభుత్వం నిసిగ్గుగా ప్రయత్నాలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజలు ...కార్మికులు ఐక్యమత్యంతో పోరాడి భారతదేశ సంపదను కాపాడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. దేశ జీడీపీ ఒకవైపు గణనీయంగా తగ్గిపోతుండగా, మరోవైపు అమెరికాలో ఉన్న భారతీయులను అక్కడి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా తిప్పి పంపిస్తుండడం వంటి తిరోగమన చర్యలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం కార్మిక వర్గంపై ఉందన్నారు.

రూ.10,500 కోట్ల ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తారు. తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని సీఎం రేవంత్ అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్ఎల్ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు. టోక్యోలో ఎన్‌టీటీ డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో పేరొందిన కంపెనీగా పేర్కొన్నారు. 50 కంటే ఎక్కువ దేశాల్లో 1,93,000 మంది ఉద్యోగులతో ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటన్నారు. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుందన్నారు. 'దేశంలో తెలంగాణ రైజింగ్ అయితే ... ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోంది' అని సీఎం అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఆహ్వానం పలికారు. టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో తెలంగాణ అధికారిక బృందం రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించింది. వివిధ రంగాలకు చెందిన 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. 'దేశంలోనే కొత్త రాష్ట్రం, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణ మీకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతోందని, జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారని, టోక్యో చాలా గొప్ప నగర'మన్నారు. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణ కలిగినవారని, మీ నుంచి తాను ఎంతో నేర్చుకున్నా అని చెప్పారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానన్నారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని... కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. భారత రాయబారి సిబి జార్జ్ ... భారత్-జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలపై మాట్లాడారు. జెట్రో (జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ మాట్లాడుతూ తెలంగాణతో సహకారాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీగా హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించ తలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ ట్కైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. అనంతరం జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయింది.

రుద్రారంలో తోషిబా పెట్టుబడులు రూ.562 కోట్లు

తోషిబా కార్పొరేషన్ అనుబంధ సంస్థ టీటీడీఐ (ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చాయి. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో టీటీడీఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తుంది. వీటితో పాటు పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్యాక్టరీలను అప్‌గ్రేడ్ చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కు రూ.562 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. రుద్రారంలో ఇప్పటికే రెండు ఫ్యాక్టరీలను విజయవంతంగా నిర్వహిస్తున్న టీటీడీఐ, ఈ కొత్త పెట్టుబడితో మూడో ఫ్యాక్టరీ నెలకొల్పనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తోషిబా కార్పొరేషన్ ఎనర్జీ బిజినెస్ డైరెక్టర్ హిరోషి కనెటా, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, టీటీడీఐ చైర్మన్... మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి ఫురుటా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. కొత్త పెట్టుబడులకు తోషిబా చేసుకున్న ఒప్పందం పారిశ్రామిక రంగంలో కొత్త ఉత్సాహమిస్తుందని రేవంత్ అన్నారు. హిరోషి ఫురుటా మాట్లాడుతూ... తెలంగాణ పారిశ్రామిక విధానాలు తమను ఆకట్టుకున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఉత్సాహంతో ఉన్నట్లు చెప్పారు.

టెక్నాలజీ పెంపొందిద్దాం

ఎలన్ మస్క్‌తో మోదీ

న్యూఢిల్లీ: అమెరికా, భారత్ మధ్య ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణల రంగంలో సహకారం పెంపొందించుకోవడానికి కట్టుబడి ఉన్నామని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్‌తో ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మోదీ శుక్రవారం మస్క్‌తో ఫోన్‌లో సంభాషించారు. ఇటీవల వాషింగ్టన్ వెళ్లినప్పుడు జరిగిన భేటీలో చర్చించిన అంశాలను గుర్తుచేసినట్లు 'ఎక్స్'లో మోదీ వెల్లడించారు. సాంకేతిక, ఆవిష్కరణల రంగాల్లో అమెరికా-భారత్ మధ్య సహకారం మెరుగుపై చర్చించామని ప్రధాని తెలిపారు. 'ఎలన్ మస్క్‌కు ఫోన్ చేసి చాలా అంశాలపై మాట్లాడాను. ఇటీవల అమెరికాకు వెళ్లినప్పుడు మేమిద్దం కలిసిన సమయంలో జరిగిన చర్చలోని అంశాలనూ ప్రస్తావించాను. సాంకేతిక, ఆవిష్కరణల రంగంలో అమెరికాతో భాగస్వామ్యం పెంచుకోవడానికి పరస్పరం కట్టుబడి ఉన్నాం' అని పేర్కొన్నారు. భారత్ మార్కెట్లలో టెస్లా, స్టార్ లింక్ సంస్థల ప్రవేశానికి కసరత్తు వేళ మస్క్‌తో మోదీ సంభాషణకు ప్రాధాన్యత ఏర్పడింది. 'కనీస ప్రభుత్వం- గరిష్ఠ పాలన దిశగా సంస్కరణలకు భారత్ కసరత్తుపై మేమిద్దరం మాట్లాడుకున్నాం. అంతరిక్షం, మొబిలిటీ, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌పై చర్చించాం. ఆయా రంగాల్లో మాకున్న ఆసక్తి, అభిరుచులు పంచుకున్నాం. మస్క్‌తో సంభాషణ స్నేహపూర్వకంగా సాగింది' అని మోదీ పేర్కొన్నారు. ఇదిలావుంటే, దేశంలో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు స్పేస్ ఎక్స్‌తో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాయి. అయితే స్టార్ లింక్‌కు భారత్ అనుమతులు ఇంకా లభించలేదు. దీంతో ఆ సంస్థ ప్రతినిధులతో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఈమధ్యనే కలిశారు. స్టార్ లింక్ భాగస్వామ్యం, భారత్‌లో భవిష్యత్ పెట్టుబడులకు ప్రణాళికపై చర్చించారు.

అందుకే సుంకాలు విధించాం: అమెరికా

న్యూఢిల్లీ: భారత్ ఉక్కు, అల్యూమినియంపై సుంకాలు విధించాలనే నిర్ణయం జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా తీసుకున్నదని, దీనిని సేఫ్‌గార్డ్ మెజర్స్‌గా పరిగణించరాదని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)కి అమెరికా తెలియజేసింది. అమెరికా విధించిన ప్రతీకార సుంకాలపై భారత్ ఏప్రిల్ 11న డబ్ల్యూటీఓకు ఫిర్యాదు చేసింది. డబ్ల్యూటీఓ సేఫ్‌గార్డ్స్ ఒప్పందం కింద అమెరికాతో ఈ విషయం గురించి సంప్రదింపులు జరపాలని కోరింది. ఉక్కు, అల్యూమినియంపై సుంకాల విధింపు అనేది ఒప్పందం ప్రకారం, భద్రతా చర్యల కిందకు వస్తుందని స్పష్టం చేసింది. అంతేకాదు ఒప్పందంలోని నిబంధనల ప్రకారం, ఈ విషయాన్ని డబ్ల్యూటీఓ కమిటీకి తెలియజేయడంలోనూ అమెరికా విఫలమైందని పేర్కొంది.

'భూభారతి'తో సమస్యలకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

సత్యనారాయణ రావు, నాగరాజు, ప్రిన్సిపల్ సెక్రటరీ (సీసీఎల్ఏ రెవెన్యూ) బుద్ధ ప్రకాష్, కలెక్టర్ దివాకర టీఎస్‌లతో కలిసి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... గత ప్రభుత్వం కుట్ర పూరితంగా పార్ట్ -బీలో పెట్టిన 18 లక్షల ఎకరాలలో ఏడు లక్షల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయని, వీటికి భూభారతి చట్టంతో పరిష్కారం చూపుతామని తెలిపారు. రాష్ట్రంలో ఇంతవరకు డాక్యుమెంట్లు లేని అబాదీ ఇల్లు అని పిలుచుకునే నివాసగృహాలకు డాక్యుమెంట్లు ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. భూ భారతి సమస్యల పరిష్కారానికి సీసీఎల్ఏ కార్యాలయానికి అనుసంధానించే టోల్‌ఫ్రీ నెంబరును త్వరలో ప్రజలకు తెలియజేస్తాం అన్నారు. గిరిజన, గిరిజనేతరులు ఉండే ప్రాంతంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ఒక కమిటీని నియమిస్తామన్నారు. కుల, మత, వర్ణ, వర్గ, ప్రాంత, పార్టీలకు అతీతంగా ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కొండ సురేఖ మాట్లాడుతూ...దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు అన్నారు. తప్పులు చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీతక్క మాట్లాడుతూ... రైతుల సమస్యలను పరిష్కరించడానికే భూ భారతి చట్టం తీసుకొచ్చినట్టు చెప్పారు. తల్లికి బిడ్డకు ఎలాంటి సంబంధం ఉంటుందో భూమికి రైతుకు అలాంటి సంబంధమే ఉంటుందన్నారు. రామకృష్ణారావు మాట్లాడుతూ... భూభారతి చట్టంపై ప్రతి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బలరాం నాయక్ మాట్లాడుతూ... రైతుల కళ్లలో ఆనందం నింపడానికే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్టు చెప్పారు. గండ్ర , నాగరాజు మాట్లాడుతూ గత పాలకులు రైతులకు భూములపై హక్కును కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో భూభారతి చట్టాన్ని నూరుశాతం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్‌పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ సిహెచ్.మహేందర్ జీ, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి కిరణ్ ప్రకాష్, ఆండీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయి' అని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో వెల్లడించారు. 'ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో నమోదు కావడం భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించినట్లు అయింది.

గార్లలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన

విశాలాంధ్ర - గార్ల: ముస్లిం మైనార్టీల హక్కులకు ముప్పుగా భావించే వక్ఫ్ బోర్డు బిల్లు ప్రతిపాదిత సవరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా, ఏకపక్షంగా వ్యవహరించిందని ముస్లిం నేతలు ఆరోపించారు. పునఃపరిశీలించి సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని గార్ల జామ మజీద్ అధ్యక్షులు ఎం.డి షఫీ యుద్దీన్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లును నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక జామ మజీద్ ఎదురుగా ముస్లింలు కుడి చేతికి నల్ల రిబ్బన్లు కట్టుకొని, చేత ప్ల కార్డులతో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పూర్వీకులు దానం చేసిన ఆస్తులతో సహా వక్ఫ్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకుని వాటిని ఆర్ఎస్ఎస్, బిజెపి అనుకూల కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డుల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే ఈ ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రం ఈ చట్ట సవరణను పునఃపరిశీలించి, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఇటువంటి నల్ల చట్టాలను తీసుకువచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జామ మజీద్ కార్యదర్శి బుడాన్, ఉపాధ్యక్షులు రహీం ఖాన్, ఎండి ఖదీర్, జిలాని, దుబాయ్ జానీ, మౌలానా మేస్త్రి, మన్సురలి, జానీ పాన్ షాప్, టైలర్ హైమద్, సత్తార్, అబ్దుల్ హకీం, జబ్బార్, మౌలానా, పటాన్ మీరా, మునీర్, సలీం, అబ్దలి, షబ్బీర్ ఖాన్, అజారుద్దీన్, జాన్ ఖాన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ప్రజల దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తు న్నట్లు నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్ రెడ్డి, వాసవి క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మిలు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రధాన కూడలి వద్ద వాసవి వనిత క్లబ్బుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను సద్వినియోగం చేసుకొని దాహార్తిని తీర్చుకోవాలని కోరారు. డిస్ట్రిక్ట్ పిఆర్ఓ గరిణె అరుణకుమారి, జిల్లా ఆరోగ్య శిబిరాల ఇన్‌చార్జి రాచకొండ శ్రీనివాస రావు, డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, జిల్లా సాంప్రదాయాల ఇన్‌చార్జి వీరవల్లి శ్రీలత, జిల్లా కమ్యూనిటీ ఇన్‌చార్జ్ కందిబండ వాసంతి, జోన్ చైర్మన్ గెల్లి లక్ష్మీనరసింహారావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ గెల్లి లక్ష్మీ ప్రసన్న, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి ఐత సుమంత్, వనిత క్లబ్ అధ్యక్షురాలు గరిణెజ్యోతి, కోశాధికారి చెరుకు కవిత, మాజీ అధ్యక్షుడు ఊటుకూరి నటరాజ్, గూండా సత్యనారాయణ, మాశెట్టి సైదయ్య, తడకమళ్ళ పరమేశం, వీరవల్లి కోటేశ్వరరావు, గజ్జల కోటేశ్వరరావు, పాల్వాయి గోపాలకృష్ణ, గరిణె వాసు, రాచకొండ రవి, అశోక్, చెరుకు రాము పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డు సత్తెనపల్లి గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రైతులందరూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులకు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ భూమి, ఆశన్న తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర - గూడూరు: కాంగ్రెస్ పార్టీనీ వీడి బీఆర్ఎస్ పార్టీలోకి శుక్ర వారం భారీ చేరికలు జరిగాయి. గూడూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కోబల్ తండా గ్రామస్తులు 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారనీ, మాజీ ఎంపీటీసీ బోడ కవిత భాస్కర్, మాజీ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్య కిషన్, బానోతు బాలు, బానోత్ శీను, గుగులోతు భాస్కర్, మన్న, గుగులో జనార్ధన్లను భానోత్ శంకర్ నాయక్ బీఆర్ఎస్ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందనీ తెలిపారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పార్టీలో అనేక పథకాలు తీసుకొచ్చిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలన వలనే నేడు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసింది ఏమీ లేదని శంకర్ నాయక్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి కోఆప్షన్ ఎండి కాసిం, మాజీ ఎంపీపీ బానోతు సుజాత మతిలాల్, మండల ప్రధాన కార్యదర్శినూకల సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం సంపత్ రావు, సీనియర్ నాయకులు వాంకుడోత్. కటార్ సింగ్, కోఆప్షన్ రహీం భాషా పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుంటున్నాం

రూ.72 లక్షలతో నిర్మించిన నూతన భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి తోపాటు ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు సద్విని యోగం చేసుస్తున్నట్లుసిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వసతుల ఏర్పాటుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ప్రభుత్వం మంజూరైన నిధులు ఏమాత్రం దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగులో రూ. 16 లక్షల నిధులతో నిర్మించిన షబ్ సెంటర్ భవనానికి, చుంచుపల్లి మండలంలోని రామాంజనేయ కాలనిలో రూ.20 లక్షలతో, వెంకటేశ్వర కాలనీలో రూ. 20 లక్షలతో, విద్యానగర్ కాలనీలో రూ. 16 లక్షలతో నిర్మించిన నూతన భవనాలను శుక్రవారం కూనంనేని ప్రారంభించి ప్రజా సేవకు అంకితం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాల పరిధిలో ఐటిడిఏ నిధులతో నాలుగు భవనాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయని తెలిపారు. ఇప్పటికి నియోజకవర్గ పరిధిలో వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో రోడ్లు, డ్రైన్లు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేశామన్నారు. ప్రజలకు నిత్యావసరాలైన త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ప్రేత్యేక ద్రుష్టి సారించామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తుసుకు న్నామని చెప్పారు. ఎమ్మెల్యే నిధులతో నియోజక వర్గంలో 14 సంఘాల భవనాలు, 7 బస్సు సెల్టర్లు, విద్యుత్ స్తంబాలు, ప్రభుత్వ భవనాలు, విద్యాలయాల అభివృద్ధి, రహదార్లు, డ్రైన్లు నిర్మించనున్నట్లు వీటికోసం రూ. 10కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో వీటికి మంజూరు లభిస్తుందని కూనంనేని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తీర్చేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. సమస్యలు లేని నియోజకవర్గాన్ని నిర్మించడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా, జిల్లా వైద్యాధి కారి భాస్కర్ నాయక్, తహశీల్దార్లు కెవిఆర్కె ప్రసాద్, కృష్ణ, ఎంపిడివోలు హేంకుబాబు, శుభా షిణి, ఐటిడిఏ అధికారులు శ్రీకాంత్, మధుకర్, శాఖల అధికారులు శివాలాల్, శివకృష్ణ, వెంకటస్వామి, నాయకులు చంద్రగిరి శ్రీనివాస రావు, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, లగడపాటి రమేష్, పాలమూరి శ్రీనివాస్, నూనావత్ గోవిందు, లింగయ్య, అజయ్, యాంద్ర మహేష్, నగేష్, పూనెం శ్రీను, గౌస్, నాని, వెంకటేష్, హరీష్, రమణ, జక్రయ్య, వీరయ్య, చంద్రయ్య, శ్రీనివాసరెడ్డి, కొల్లి నాగేశ్వరరావు, ఆకుల వెంకటేశ్వర్లు, పూర్ణ, పున్నమ్మ పాల్గొన్నారు.

రైతులకు మునగ సాగు వరం లాంటిది : కలెక్టర్

విశాలాంధ్ర - పినపాక : మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదని, వీటి ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్ర వారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో సాగు చేస్తున్న మునుగతోటను ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో మునగకు భారీ డిమాండ్ ఉంటుందన్నారు. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపార పరంగానూ మునగను సాగు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు వివరించారు. ఇటీవలి పరిశోధన లతో ఏకవార్షిక రకాలు అంటే ఆరు నెలల్లోనే కాతకు వచ్చే రకాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. సాగులో మెలకువలు పాటిస్తే, మేలైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు. మునగ సాగు రైతులకు ఒక వరం లాంటిదని ప్రతి రైతు కనీసం ఒక్క ఎకరంలోనైనా మునగ సాగు చేసేలా ఎంపీడీవోలు అవగాహన కల్పించాలన్నారు. పోడు భూముల్లో మునగ సాగు చేసే రైతులకు బోర్ల పర్మి షన్ల కోసం ఫారెస్ట్ ఆఫీసర్లతో మాట్లాడి ఇప్పిస్తామ న్నారు. జిల్లాలోని ఆదర్శ రైతులంతా మునగ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగు చేపట్టేలా రైతులు ముందుకు రావాలన్నారు.

మునగ సాగు రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేసారు. మునగ పంట సాగు చేస్తున్న రైతు వర్మను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్ర స్వామి, అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ సిబ్బంది, ఈ బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి : కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : అత్యవసర పరిస్థితిలో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యంచేయించుకొని ఆర్ధికంగా నష్టపోయిన పేదలకు అదేవిదంగా ఆడబిడ్డలకు, పేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా నేరుగా ఆర్ధిక సాయం అందించడం హర్షణీయమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పేద కుటుంబాలకు ఈ పథకాలు భరోసా కల్పిస్తున్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని 170 మంది లబ్దిదారులకు చీఫ్ మినిష్టర్ రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 69.50లక్షల విలువ చేసే చుక్కుల తోపాటు 86 మంది కల్యాణ లక్ష్మి-షాదిముబారక్ పథకంలో మంజూరైన రూ. 86.86లక్షల విలువైన చెక్కులను శుక్రవారం కొత్తగూడెం క్లబ్బులో జరిగిన కార్యక్రమంలో కూనంనేని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ పథకం మంజూరు మరింత వేగవంతం చేయాలన్నారు. రూ.60వేల సీలింగ్ విధానాన్ని రద్దు చేసి పూర్తి ఖర్చులను లబ్దిదారులకు అందిస్తు పేదలకు చాలా ప్రయోజనం ఉంటుందన్నారు. ఆడబిడ్డలకు వివాహం చేసి ఆర్ధిక ఇబ్బందులు పడుతున్న పేదకుటుంబాలని కల్యాణ లక్ష్మి-షాదిముబారక్ పథకం ఆసరాగా నిలుస్తోందన్నారు. ఈ పథకం అమలులో సాంకేతిక లోపాలను సరిచేసి ధరఖాస్తుదారులందరికి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల హామీని పూర్తి స్థాయిలో అమలు చేసి తమ చిత్తశుద్ధిని ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె. సాబీర్ పాషా, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్, కొత్తగూడెం డిప్యూటీ తహసీల్దార్ అంజద్, మున్సిపల్ కమిషనర్ లు సుజాత, పిఏ సురేష్, నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, వంగ వెంకట్, జి.వీరస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, జక్కుల రాములు, ఎస్ కె ఫహీమ్, మాజీ కౌన్సిలర్లు ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, మునిగడప పద్మ, రమణమూర్తి, లగడపాటి రమేష్, మిర్యాల రాము, రాంబాబు, ఖయూమ్, శ్రావణ్, అంకుస్ తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేసినా, పోస్టలు పెట్టినా చట్టరిత్యా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ కుల సంఘాలకు చెందిన నాయకులతో పీస్ మీటింగ్ నిర్వహించిన జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో 24ఇంటూ 7 అందుబాటులో ఉంటాం ఏ సమయంలోనైనా ఈ నెంబర్ 8712656777 కు కాల్/ మెసేజ్ ద్వారా సమాచారం అందించవచ్చు ఆయన తెలిపారు డా. బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యంగ నిర్మాత, ఆయన ఏ ఒక్క కులానికి, మతానికి, ప్రాంతానికి పరిమితమైన వారు కాదని, ఆయన భారతదేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు సైతం మార్గదర్శకంగా నిలిచారని ఎస్పీ గుర్తు చేశారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఎవరైన చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. వివిధ సంఘాలకు చెందిన పెద్దలు గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి, కమ్మ్యునిటీ ప్రశాంతత గురించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు శాఖ తరపున ఎల్లవేళలా సహాయ సహకారాలు అంధించడం జరుగుతుందని అన్నారు. ఎఐ (కృత్రిమ మేధస్సు) అందుబాటులో ఉన్న ప్రస్తుత రోజుల్లో ఎఐని ఉపయోగించి మనం చేసే పనిని సులభతరం చేసుకుంటున్నాం, కానీ కొందరు యువత ఎఐని చెడు మార్గాలలో వినియోగిస్తూ లేనిది ఉన్నట్టుగా వికృత ఫోటోలు తయారు చేసి, సోషల్ మీడియా ద్వారా పోస్టు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు అని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించేది లేదని, జిల్లా ఐటి సెల్ నుండి సోషల్ మీడియా పై నిరంతరం మానీటరింగ్ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా పోలీసు శాఖ తరపున వివిధ గ్రామాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావం చాలా ఎక్కువగా ఉందని, సోషల్ మీడియాలో వచ్చేవన్ని నిజాలు కావని గుర్తించాలని, ఫార్వర్డ్ మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఆ మెసేజ్‌లో నిజం ఎంత? అని గుర్తించిన తరువాతనే ఫార్వర్డ్ చేయాని అన్నారు. వాట్స్ ఆప్ గ్రూప్ లలో ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు చేసిన సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై చట్టరిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, ఎస్పీ, డీసీఆర్బీ ఇన్స్పెక్టవర్స్ విజయ్ కృష్ణ, రమేష్, వివిధ సంఘాల నాయకులు అతిమెల మాణిక్యం, కూన వేణు, కొండాపురం జగన్, పి. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : పాలకుర్తి మండలంలోని బసంత్ నగర్, పాలకుర్తి, గుంటూరు పల్లి, ఎల్కలపల్లి, కొత్తపల్లి, రామారావుపల్లి, తక్కలపల్లి, పుట్నూర్, గుడిపల్లి, జయారం, కుక్కలగూడూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఏంఎస్ రాజ్ ఠాకూర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పిస్తూ, దళారులు లేకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర లభించడంతో పాటు సకాలంలో చెల్లింపులు చేయబడతాయని అయన వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రభుత్వ అధికారులు, రైతు సమితి సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాల్లో ఘనంగా గుడ్ ఫ్రైడే

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లాల్లోని మండలాలల్లో, గ్రామాలలో శుక్ర వారం వివిధ చర్చ్‌లలో ఘనంగా గుడ్ ఫ్రైడే నిర్వహించారు. ఎంతో భక్తి శ్రద్ధలతో చర్చ్‌ల్లో దైవసేవకుల ఆధ్వర్యంలో విశ్వాసులు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చ్ దైవసేవకులు, విశ్వాసులు, పాల్గొన్నారు.

లివింగ్ గాడ్ చర్చ్‌లో ఘనంగా గుడ్ ఫ్రైడే

ఏటూరునాగారం మండల కేంద్రంలోని లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ చర్చ్‌ల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా, దైవసేవకులు ఎస్. సామెల్ సన్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పెద్దలు, పిల్లలు, విశ్వాసులు, ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. సిలువపై మృతి చెందిన యేసుక్రీస్తు జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ గత కొద్దీ రోజుల నుండి విశ్వాసులు ఉపవాసం ఉండి శుక్ర వారం గుడ్‌ఫ్రైడే రోజు చర్చ్‌లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో సేవకులు లాజర్, సంఘాల పెద్దలు కుమారస్వామి, సమ్మయ్య, యెంపెల్లి నరేష్, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు వెనక్కి తీసుకోవాలని ముస్లింల మానవహారం

విశాలాంధ్ర - ఇల్లందు : కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం ముస్లింలను అన్ని విధాల నడిచి వేసేందుకు రాజ్యాంగ విరుద్ధంగా బిల్లులు తెస్తుందని ఇల్లందుకు చెందిన ముస్లిం సంఘాల నేతలు ఆరోపించారు. ఇటీవలే లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రధాని మోడీ సారథ్యంలో ఆమోదించిన వక్ఫ్ ఎమెండ్‌మెంట్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనలతో శుక్రవారం ఉద్యమించారు. పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో పెద్దఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి, మానవహారం నిర్వహించి ముస్లింలు తమ వ్యతిరేకతను ఐక్యంగా చాటారు. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని లెక్క చేయకుండా వక్ఫ్ ఎమెండ్ బిల్లును తీసుకొచ్చిందన్నారు. సవరణలను పూర్తిగా రద్దు చేసే వరకు ఊరుకునే ప్రసక్తే లేదని ముస్లిం నేతలు హెచ్చరించారు. కేంద్ర చర్యలను లౌకికవాదులు, ప్రజా ఉద్యమ సంఘాలు ఖండించాలని కోరారు. బిల్లును ఉపసంహరించకుంటే వివిధ రాజకీయ పార్టీల నేతతా జేఏసీగా ఏర్పడి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ముస్లిం సంఘాల నేతలు రాజకీయ పార్టీలకు చెందిన ముస్లిం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదు : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం నిర్మాణాల్లో ఎలాంటి అక్రమాలు జరిగిన సహించేది లేదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చెప్పారు. భద్రాచలం గ్రామపంచాయతీలో అధికారి పూస జగదీష్ ఒక ఇంటి నిర్మాణం విషయంలో బేస్ మెట్ లెవల్ లేకుండానే బిల్లు కోసం ఆన్లైన్ లో అప్లోడ్ చేయడం జరిగింది. దీంతో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ విషయాన్ని కలెక్టర్ గుర్తించారు. శుక్రవారం సదరు అధికారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. జనవరి 26 నుండి అమలవుతున్న ఇందిరమ్మ ఇల్లు భద్రాచలంలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రతిష్టాత్మకంగా తీసుకోని నిర్మిస్తున్నారు. లబ్ధిదారులకు ముందుగా పంచాయతీ కార్యదర్శి, వర్క్ ఇన్స్పెక్టర్ లు మార్క్ అవుట్ ఇచ్చిన తరువాత, బేస్మెంట్ స్థాయి వరకు పూర్తి చేసాకే లాగిన్లో ఫోటో కాప్చర్ చేసి ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ పలు మార్లు చెప్పారు. కానీ భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారి సరైన విచారణ చేయకుండా ఆన్లైన్ చేయటం వల్ల సస్పెండ్ చేసినట్టు కలెక్టర్ వెల్లడించారు. అధికారులు ఎవరైనా ఇలాంటి పొరపాటు చేయకుండా జాగ్రత్త పడాలని కలెక్టర్ మరోసారి ఆదేశించారు. ఎక్కడైనా ఇలాంటి పొరపాట్లలకు పాల్పడితే వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిరుపేదకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ చెందిన కిషోర్ సింగ్ కుటుంబంతో గత కొన్ని సంవత్సరాల నుండి ప్రధాన రహదారి పక్కన చిన్న పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. అతను గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై మంచాన పడడంతో కుటుంబ సభ్యులు కడుపార తిండి లేక ఇబ్బందులకు గురి అవుతున్నారు అన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెంటనే స్పందిస్తూ వారి నివాస గృహం వద్దకు వచ్చి వారికి నిత్యవసర వస్తువుల అవసరాల కొరకు పదివేల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుల సత్యం మండల అధ్యక్షులు దొనికేని దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌లో ఉత్తమ స్థానంలో నిలిచిన పెంబి బ్లాక్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన నిర్మల్ జిల్లా పెంబి బ్లాక్ జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్, 3వ జోన్‌లో 2 వ స్థానంలో నిలిచినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్ర వారం తెలిపారు. భారత ప్రభుత్వ ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఎబిపి) కింద పెంబి బ్లాక్ అక్టోబర్ నెల నుండి డిసెంబర్-2024 త్రైమాసికానికి మొత్తం 500 బ్లాక్ లలో ర్యాంకింగ్స్‌లో జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్, 3వ జోన్‌లో 2వ ర్యాంక్‌ను సాధించిందన్నారు. దీంతో పెంబి బ్లాక్ అభివృద్ధి కోసం 1 కోటి రూపాయల అవార్డును కూడా సాధించిందన్నారు. ఇది ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, ప్రాథమిక మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాలతో సహా, 40 రంగాల పనితీరు సూచికల ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లు సాధ్యమైనట్లు తెలిపారు. జూలై 2024లో నిర్వహించిన సంపూర్ణనాత్ అభియాన్, పనితీరును మెరుగుపరచడంలో కూడా ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జిల్లా అధికారులు, పెంబి మండలం అధికారులు, ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్ ల కృషి, ప్రజల సహకారంతో ఈ అద్భుతమైన విజయం దక్కిందని కలెక్టర్ అభినందనలు తెలిపారు.

సెక్యూరిటీ గార్డ్‌పై దాడి...

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి బహదూరపల్లి అయోధ్య విల్లాల్లో తెల్లవారుజామున 5.17 నిమిషాలకు సెక్యూరిటీ గార్డు ను విచక్షణా రహితంగా చితకబాది నిందితులు పరారైన సంఘటనలో బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న దుండిగల్ పోలీస్ లు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పోలీస్ లు,స్థానికులు తెలిపిన వివరాల శుక్రవారం తెల్లవారుజామున సుమారు 5.17 నిమిషాలకు ఏపీ28బియూ6886 కారులో వచ్చిన నిందితులు మన్నే గణేష్, వారాల అజయ్ మరికొందరు తాగిన మైకంలో వేగంగా వచ్చి అయోధ్య విల్లాల్లో ఉన్న టీఎస్ 08జేఏ 3933 కారును బలంగా గుద్దడంతో కారు అద్దాలు పగిలినట్లు సమాచారం.అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు దిలీప్(55) అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అతనిని కాళ్లతో తన్ని విచక్షణా రహితంగా దాడిచేసినట్లు సమాచారం, కాలనీ వాసులు బాధితుని భార్య పూల్ బాయ్ దుండిగల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ ఐ ఆర్ 404/2025,అండర్ సెక్షన్ 126,281 115(2),351(2),292 రెడ్ విత్ 3(5) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీస్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.బాధితుడు బహదూరపల్లి లోని ఎస్ వి సూపర్ స్పెశాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

సంపాదకీయం

స్వచ్ఛంద బానిసత్వం

బానిసత్వాన్ని రద్దు చేయడానికి చట్టాలు చేయొచ్చు. వాటిని అమలు చేసే ప్రయత్నమూ జరగొచ్చు. కానీ స్వచ్ఛందంగా బానిసలుగా ఉండాలనుకునే వారిని బానిసత్వం నుంచి విముక్తి చేయడం అసాధ్యం. మన విశ్వవిద్యాలయాల పరిస్థితి స్వచ్ఛంద బానిసత్వంలానే తయారైంది. విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తి ఉంటుంది. విశ్వవిద్యాలయం అంటేనే భిన్న భావాల వ్యక్తీకరణకు అవకాశం ఉండే చోటు. కానీ ఆ లక్షణాన్ని మన విశ్వవిద్యాలయాలు కోల్పోతున్నాయి. మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామక తీరు సమూలంగా మారిపోయింది. బీజేపీ భావజాలానికి అనుకూలంగా ఉండే వారిని వెతికి వెతికి వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తున్నారు. అలా నియమితులైన వారు ఏలిన వారు చెప్పకపోయినా వారికి అనుకూలంగా వ్యవహరించే కళలో నిష్ణాతులు అయిపోయినట్టున్నారు. దీనికి తాజా ఉదాహరణ దిల్లీ విశ్వవిద్యాలయంలో కనిపిస్తున్న పరిణామాలేననిపిస్తోంది. దిల్లీ విశ్వవిద్యాలయంలో హిందీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అపూర్వానంద్‌కు న్యూయార్క్‌లోని న్యూ స్కూల్ అనే విశ్వవిద్యాలయం నుంచి ఆహ్వానం వచ్చింది. ఇది ఆయనకు దిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హోదాలో వచ్చిన ఆహ్వానం కాదు. వ్యక్తిగతంగా ఆయనను ఆహ్వానించారు. తొమ్మిది రోజుల పాటు ఆయన న్యూయార్క్ వెళ్లి అక్కడ ఉపన్యసించడంతో పాటు అక్కడి విద్యార్థులతో, అధ్యాపకులతో, ఇతర నిపుణులతో సంభాషించడానికి ఒక అవకాశం. ఇలాంటి ఆహ్వానం ఆయన పని చేస్తున్న సంస్థకు కూడా గర్వకారణం కావాలి. తనను దిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హోదాలో ఆహ్వానించలేదు కనక సెలవు పెట్టి వెళ్లాలనుకున్నారు. నిబంధనల ప్రకారం నెల రోజుల ముందే సెలవు కావాలని అర్జీ పెట్టుకున్నారు. ఆ గడువు ఏప్రిల్ ఒకటిన పూర్తి అయింది. ఇలాంటి సెలవులు రెండు మూడు విభాగాల ద్వారా వెళ్తాయి. అంతిమ నిర్ణయం తీసుకునే అధికారి మంజూరు చేయాల్సి ఉంటుంది. తనకు సెలవు మంజూరు కాలేదు కనక ఆయన అడగడం మొదలు పెట్టారు. ఆయనకు ఆశ్చర్యకరమైన సమాధానాలు వచ్చాయి. ఈ సమాధానాలు ప్రొఫెసర్ అపూర్వానంద్‌కు కలగజేసే నష్టాన్ని అటుంచినా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసేవిగా ఉన్నాయి. ఆయనకు సెలవు మంజూరు చేయాలంటే న్యూయార్క్‌లో ఆయన చేయబోయే ప్రసంగ పాఠాలను దిల్లీ విశ్వవిద్యాలయ అధికారులకు అందించాలట. ఇలాంటి నియమం ఎప్పుడూ లేదు. ఇలాంటి నియమ నిబంధనలు ఎప్పుడూ లేవని ఇప్పుడు మాత్రం తాము ముందే ప్రసంగ పాఠం సమర్పించాలని కోరుతున్నామని అధికారులు సమాధానం ఇచ్చారు. ఒక ప్రొఫెసర్‌కు సెలవు మంజూరు చేయాలంటే కేంద్ర విద్యాశాఖ అనుమతి కావాలంటున్నారు. విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తిగల సంస్థలు కనక విద్యాశాఖ జోక్యం చేసునే అవసరమే ఉండదు. అలా జోక్యం చేసుకున్న పూర్వోదంతాలూ లేవు. కానీ అపూర్వానంద్‌ను మాత్రం న్యూయార్క్ లో తాను చేయబోయే ప్రసంగ పాఠాలు అందించమనడం ఆశ్చర్యంగా ఉంది. దీనితో ఆయనకు వెళ్లాలో లేదో తెలియటంలేదు. వెళ్లగలరో లేదో తెలియదు. చివరకు రిజిస్ట్రార్‌ను సంప్రదించినా న్యూయార్క్‌లో చేయబోయే ప్రసంగ పాఠాలు సమర్పించాల్సిందేనన్నారు. ఇది ఒక రకంగా సెన్సార్షిప్ విధించడం లాంటిది. పాఠాలు చెప్పే ప్రొఫెసర్ భావాప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే. తమ స్వయం ప్రతిపత్తికి, స్వేచ్ఛకు తమంత తామే విఘాతం కలిగించుకోవడమే. ఇది స్వచ్ఛంద బానిసత్వ ధోరణి మాత్రమే.

మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత సకల వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకున్న మాట నిజమే కావొచ్చు. కానీ ఒక ప్రొఫెసర్‌కు మరే దేశం నుంచో ఆహ్వానం వస్తే, దాని కోసం సెలవు కోరినప్పుడు ఇన్ని అవాంతరాలు కల్పించాలని కచ్చితంగా కేంద్ర ప్రభుత్వంగానీ, కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ గానీ ఆదేశాలు జారీ చేసి ఉండదు. పైగా ఇలాంటి ఉదంతాలు ఇదివరకు ఎప్పుడూ లేవు. కానీ విశ్వవిద్యాలయాలను భయం ఆవరించింది. అధ్యాపకులు స్వేచ్ఛగా పాఠం చెప్పలేకపోతున్నారు. కానీ ఆ సంప్రదాయం క్రమంగా మాయమైపోతోంది. చాలా విచిత్రమైన వ్యవహారం ఏమిటంటే చేయని తప్పుకు పదేళ్ల జైలు శిక్ష అనుభవించిన, తొంభై శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా చివరకు న్యాయస్థానం ఆదేశం మేరకు విడుదలై ఉండొచ్చు. కానీ ఆయన జైలులో దుర్భర జీవితం అనుభవించవలసి వచ్చింది. ఆయన తరఫున న్యాయ పోరాటం చేస్తూ ఆయన భార్య వసంత నిరంతరం శ్రమించారు. నిద్ర లేని రాత్రులు గడిపారు. చివరకు నిష్కారణంగా సాయిబాబాను ఉద్యోగం నుంచి తొలగించారు. ఆయనా దిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన వారే. ఆయన మరణించిన తరవాత దిల్లీ విశ్వవిద్యాలయంలో కనీసం సంతాపసభ పెట్టుకునే వీలులేకుండా పోయింది. అనేక అడ్డంకులు ఎదుర్కోవాల్సి వచ్చినందువల్లే దిల్లీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా ఉన్న ఉపేంద్ర బక్షీ రాజీనామా చేయవలసి వచ్చింది. ఇటీవల దిల్లీ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం జరిగినప్పుడు దిల్లీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఇచ్చిన సందేశంలో పట్టా పుచ్చుకున్న విద్యార్థులు బయటకు వెళ్లిన తరవాత దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని సలహా ఇచ్చారు. ఈ సలహా ఇవ్వాల్సిన అవసరం ఏమిటో తెలియదు. ఒకవేళ చదువుకునే సమయంలోనే ఏ విద్యార్థులైనా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనుకున్నప్పుడు అప్పుడే చర్య తీసుకుని ఉండొచ్చు. అదేమీ లేకుండా పట్టా పుచ్చుకున్న విద్యార్థులు బయటకు వెళ్లిన తరవాత దేశ వ్యతిరేక కార్యకలాపాకు పాల్పడతారన్న అనుమానం ఆ వైస్ ఛాన్సలర్‌కు ఎందుకు వచ్చిందో తెలియదు. తనంత తాను మోదీ ప్రభుత్వ భావజాలాన్ని అమలు చేయాలనుకుంటే తప్ప ఆయన ఇలాంటి మాటలు మాట్లాడే అవకాశమే లేదు. అపూర్వానంద్ విషయంలో ఆయన సెలవు దరఖాస్తు రెండు మూడు విభాగాల నుంచి మంజూరీ లభించింది. కానీ రిజిస్ట్రార్ అంతిమ ఆమోదం తెలియ జేయకుండా నిలిపివేశారు. విశ్వవిద్యాలయాలలో ఉన్న భయవాతావరణం, విశ్వవిద్యాలయాధికారులకు లిఖిత రూపంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆయన సెలవు మంజూరు చేయకూడదని ఆదేశాలు వచ్చాయను కుందామన్నా దానికి సంబంధించిన దాఖలాలు కనిపించడం లేదు. అపూర్వానంద్ రాసిన అనేక లేఖలకు ఉన్నతాధికారుల నుంచి సమాధానం రావడమే గగనమై పోయింది. చివరకు సెలవు తిరస్కరించారు. ఎందుకు తిరస్కరించారని అడిగినా సరైన సమాధానం లేదు. చివరకు ముందు చెప్పినట్టే న్యూయార్క్‌లో చేసే ప్రసంగ పాఠాలను అందజేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల అధికారులు ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి ఉండనక్కర్లేదు. ఏలికల మెప్పు పొందడానికి ఇలాంటి పనులు చేయాల్సిన అవసరం అంతకన్నా లేదు. అయినా విశ్వవిద్యాలయాల పీఠాధిపతులు ఏలిన వారిని మెప్పించడానికి తాపత్రయపడడం, ప్రభుత్వం దగ్గర తమ విశ్వాసపాత్రతను రుజువు చేసుకోవాలనుకుంటున్నట్టు ఉంది. నిజానికి వారికి మెప్పు రావాల్సింది పండిత వర్గం నుంచి. తోటి విశ్వవిద్యాలయ అధ్యాపకుల నుంచి. ఇవేవీ వారికి పట్టడం లేదంటే స్వచ్ఛంద బానిసత్వాన్ని ఎంచుకుంటున్నారనే.

వృద్ధ భారతాన్ని చిదిమేస్తారా... !?

"వృద్ధాప్యం సంతానం సాలెగూట్లో పురుగు
వెచ్చదనం ఎటో ఎగిరిపోతే
మంచుగడ్డ శరీరానికి వాకిలి ఓ దివ్యక్షేత్రం
చుట్టాలు... పక్కాలు తెగ్గోసిన ప్రవాహం
దిక్కుమాలిక వృద్ధాప్యం... డబ్బులేని వృద్ధాప్యం"

ఇది ప్రఖ్యాత కవి కె.శివారెడ్డి రాసిన పద్యంలో ఓ పాదం. ఇది రాసి దాదాపు మూడు దశాబ్దాలు దాటింది. ఇంతకంటే కాసింత కటువుగా ఇదే పద్యాన్ని రాజ్యసభ సభ్యురాలు జయాబచ్చన్ పెద్దల సభలో అన్నారు. అమితాబ్ బచ్చన్ భార్యగా, ఒకప్పటి హీరోయిన్‌గా తెలిసిన జయాబచ్చన్ రాజ్యసభలో తన ప్రసంగంతో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించారు. నిజానికి జయాబచ్చన్‌కి వృద్ధుల గురించి వగచాల్సిన అవసరం కాని, అగత్యం కానీ లేదు. "దేశంలో 65 సంవత్సరాలు దాటిన వృద్ధులని చంపేయండి" అంటూ ఆవేశించాల్సిన పనీ లేదు. జయాబచ్చన్ గతం మనకి తెలియదు కాని వర్తమానం, భవిష్యత్తు మాత్రం ఆర్థికంగా ఆమె ఎలాంటి ఇబ్బంది పడే కుటుంబమేం కాదు. మరి ఎందుకు ఇంతటి మాటలన్నారు?

ఈ త్రివర్ణ పతాక దేశంలో వయసు వర్ణం వెలిసి పోయిన వృద్ధుల గురించి ఎందుకు మాట్లాడారు? ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది? నేటి ఈ ఆధునికానంతర పరిస్థితుల్లో వృద్ధాప్యం ఓ శాపం. వృద్ధాప్యం ఓ చులకన.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

మాట్లాడాల్సిన చోట మాటలుండవు. సౌంజ్ఞల భాషే కుటుంబాల అధికార భాషగా వర్ధిల్లుతున్న కాలం. ఈ వృద్ధుల సంతానం తమ ఎదుగుదలే లక్ష్యంగా ల్యాప్‌టాప్‌ల ముందు "ఎలుక పిల్లలా" నాట్యమాడుతున్న లోకం. ఎదగాలి. ఇంకా ఎదగాలి. ఎంత త్వరగా ఎదగగలిగితే అంత త్వరగా ఎదగాలి. అందుకోసం వృద్ధాప్యం అనుభవాలను వినకూడదు. అసలు ఇళ్లల్లో వారున్నారనే ధ్యాసే ఉండకూడదు. అత్తమామలు లేని సంబంధాలే చూడమంటున్నారు ఈ కాలం అమ్మాయిలు. తమ కూతురికి ఏ బాదరబందీ లేని అబ్బాయే కావాలంటున్నారు తలిదండ్రులు. ఆ ఆరాటం, ఇలాంటి వేటలో వృద్ధాప్యం నలుగుతోంది. ముడతలు పడి లోలోపలకు కూరుకుపోయిన కళ్ల నుంచి కారే కన్నీళ్లు ఈ తరానికి అవసరం లేదు. కడుపున పుట్టిన వారికే కన్న వారిపై ఎలాంటి ప్రేమలూ లేని దిక్కుమాలిన లోకం ఇది. ఇలాగే ఉంటుంది. ఇలాగే ఉండాలనుకుంటుంది. ఇలాగే గడిచిపోవాలని కోరుకుంటుంది. ప్రభుత్వాలు కూడా ఇలాంటి ఓటర్లు ఎన్నుకున్నవే కదా..!! వీళ్ల ఆలోచనలని అధికారికంగా వాళ్లు అమలు చేస్తారు. అందుకే వృద్ధులకు ఈ దేశంలో ఎలాంటి సౌకర్యాలు ఉండవు. ఈ అసౌకర్యపు బతుకులు బతకలేక... మరణించలేక ఈ దేశంలో వృద్ధాప్యమంతా కన్నీరవుతోంది.

మళయాళ రచయిత ఓ.వి.విజయన్ కథ ఒకటుంది. తండ్రి మరణిస్తే విదేశాల్లో ఉన్న కొడుకు తల్లికి ఉత్తరం రాస్తాడు. "నేను రాలేను. ఇంత హఠాత్తుగా రావడం నాకు వీలు పడదు. నాన్న శవానికి అంతిమ క్రియలన్నీ ఓ వేడుకలా జరిపించండి. ఎంత డబ్బైనా నేను పంపుతాను. మొత్తం కార్యక్రమం అంతా వీడియో తీయించండి. అవి నాకు పంపండి. నేను చాలాసార్లు చెప్పాను ఈ సిగరెట్లు మానేయండి అని. ఆయన వినలేదు. నాన్న శవం మీద సిగరెట్లు పేర్చండి. వాటితో కలిపి దహనం చేయండి" ఇలా ఉంటుంది ఆ ఉత్తరం. అది చదివిన తల్లి... "నిన్ను చూసి ఏళ్లు గడిచిందనే ఆయన నిత్యం పొగచూరుతున్నారు రా... ఇప్పుడూ నువ్వు రావని తెలిసే సిగరెట్లు కాల్చడం మానేసి తన దేహాన్నే కాల్చుకుంటున్నార్రా" అని రోధిస్తుంది.

నేటి ప్రభుత్వాలు కూడా కన్న కొడుకు కంటే దారుణంగా ఉన్నాయని చెప్పేందుకే జయాబచ్చన్ ఆ పెద్దల సభలో ఆగ్రహించారు. ప్రభుత్వోద్యోగులకు పింఛను ఠంచనుగా వస్తుంది. మిగిలిన వృద్ధుల మాటేమిటి..! అని ప్రభుత్వ పెద్దలని ప్రశ్నిస్తున్నారు. నిలదీస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చాక ద్రవ్యోల్బణం పెరిగిందని, తలసరి ఆదాయం కూడా దానితో పాటే పెరిగిందని నిర్మలమ్మ ఉభయ సభల్లోనూ ఆనందంగా చెబుతారు. ద్రవ్యోల్బణం సరే... "దయో"ల్బణం మాటేమిటి అన్నదే నా ప్రశ్న. కాదు కాదు జయాబచ్చన్ ప్రశ్న. అమ్మా జయాబచ్చన్... ఈ దేశంలో వృద్ధులను ఏరిపారేసే పథకాన్ని ప్రవేశపెట్టమని ఆ పెద్దల సభలో చెప్పు తల్లి. ఏలికలే కాదు... వృద్ధులున్న ఇళ్లలోని యువతరం కూడా శ్రద్ధగా వినండి. "మీరూ పడతారు జీవన ప్రయాణంలో '+ 65' వాహనం కింద. ఇది శాపం కాదు. అందరి జీవనయానంలో ఓ క్రియ.

ఈ మధ్యనే తెలంగాణాలో నాలుగో తరగతి విద్యార్థి ఓ ప్రశ్నకు రాసిన సమాధానం వైరల్ అయ్యింది. ఇంతకీ ఆ ప్రశ్న ఏమిటంటే... "మీ అమ్మకి ఏది ఇష్టం... ఏది అయిష్టం" అని ప్రశ్నాపత్రంలో అడిగారు. దానికి ఆ పిల్లాడు ... "మా అమ్మకి నలుపు రంగు ఇష్టం. మా అమ్మకి ఆ కూర ఇష్టం. మా అమ్మకి ఈ ఊరు ఇష్టం" అని సమాధానం రాశాడు. ఇష్టం లేనివి ఇవీ అంటూ... "మా అమ్మకి నానమ్మ ఇష్టం లేదు. మా అమ్మకి తాతయ్య ఇష్టం లేదు" ఇది సమాధానం. శభాష్. ఇలాగే పెంచాలా భవిష్యత్ తరాన్ని...!? మీ మనవలు, మనమరాండ్రూ కూడా ఇలాంటి జవాబులే రాయాలని కోరుకుంటున్నారా...!? ఇలా రాయకుండా ఉండాలంటే మీ ఇష్టాలు మార్చుకుంటారా...! మీ బంధాలను కాపాడుకుంటారా... ! మీ ఇష్టం. కాకపోతే తలిదండ్రులూ... అదిగో క్యాలండర్ మారుతోంది. 65 అంకె ఇంకెంతో దూరంలో లేదు. తస్మాత్ జాగ్రత్త..

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణ అవశ్యం

బంగారు వీబీ ఆచార్యులు

భారత రాజ్యాంగం ప్రతి భారతీయునికి దారి దీపం. నూట నలభై కోట్ల మంది జనాభా కలిగిన ఈ దేశంలో పిల్లలు మినహా పెద్దలంతా ఏదో సందర్భంలో రాజ్యాంగం అనే పదాన్ని వాడే ఉంటారు. మన దేశంలో అత్యంత నిరాదరణకు గురైన మహాగ్రంథం భారత రాజ్యాంగమే. అది కేవలం ఐఏఎస్‌లు, న్యాయ మూర్తులు, న్యాయవాదులు, పోలీస్ ఉన్నతాధికారులు మినహా ఎవరూ కనీసం చూడనైనా చూసి ఉండరు. రాజ్యాంగాన్ని చదివి, తనకు ఈ దేశం పట్ల గల బాధ్యతలేమిటో? తనకు గల హక్కులేమిటో తెలుసుకున్న ప్రబుద్ధులెందరో ఒక్కసారి సర్వే నిర్వహిస్తే అసలు కథ బయట పడుతుంది. ఈ సర్వే అధికారం వెలగ బెడుతున్న రాజకీయ నాయకుల నుంచి మొదలు పెడితే సరి. రాజ్యాంగం చదవటం అనివార్యంగా విద్యా వ్యవస్థలో చర్యలు తీసుకోపోతే సమాజం ఎప్పుడూ తప్పులతడక గానే ఉంటుంది. రాజ్యాంగం గురించి తెలిసినా తెలియకపోయినా నాల్గొందలు సీట్లు గెలుస్తాం, రాజ్యాంగాన్ని మార్చేస్తాం అనే ప్రగల్భాలు చూశాం. గెలిస్తే వీళ్లు ఎలాగు అలాంటి పని చేస్తారేమో అని ఎంతో కొంత రాజ్యాంగం ద్వారా లబ్ధి పొందుతున్నవారు ఉన్న సీట్లు కుదించారు.

"భారత దేశ ప్రజలమైన మేము/ భారత దేశాన్ని, సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి,/ ఈ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని,/ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని, అంతస్తుల్లోను, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చుటకు,/ వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి 1949 నవంబర్ 26 న మన రాజ్యాంగ పరిషత్తు ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే సమర్పించుకుంటున్నాము. అని భారత రాజ్యాంగ పీఠికలో స్పష్టంగా రాసుకున్నారు. ఇది ఎవరికి ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేదు. అయినా అధికార గణం రాజ్యాంగ ధర్మాలను, ప్రజాస్వామ్య సూత్రాలను తుంగలోతొక్కే ప్రయత్నం సదా చేస్తూనే ఉంది. అన్ని మత గ్రంథాలలోని సూక్తుల్లో, గీతలో, శ్లోకాల పట్ల ఉన్న ఆసక్తి రాజ్యాంగం పట్ల ఉండటం లేదనేది వాస్తవం. ఏ గ్రంథాన్నయినా స్వయంగా ప్రశ్నిస్తూ చదవకుండా ఉంటే ఎవరో చెప్పిన అబద్ధాలే నిజాలుగా చలామణి అవుతాయి.

భారత రాజ్యాంగం మొత్తం 22 విభాగాలుగా, 12 షెడ్యూళ్లుగా, 395 ప్రధాన అధికరణలుగా ఉన్నాయి. రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తుంది. అన్ని మతాల వారికి, అన్ని కులాల వారికి సమాన హక్కులు, సమాన పన్నులు ఉంటాయి. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేవు. అధికరణ 14 : చట్టం ముందు అందరూ సమానులే, అలాగే 15 వ అధికరణలో కుల, మత, లింగ వివక్షాలకు తావులేదు. అధికరణ 17 లో అంటరానితనం నిషేధం, అధికరణ 19 భావ ప్రకటనా స్వేచ్ఛ, అధికరణ 21(ఏ) విద్యా హక్కు అలాగే అధికరణ 25 ప్రకారం మత విశ్వాసం కల్గి ఉండటం, మత ప్రచారం చేసుకునే హక్కు కల్పించినప్పటికీ, అధికరణ 28 ప్రకారం విద్యాలయాల్లో మత బోధన చేయరాదు. ఇలాంటి విషయాలన్నింటినీ భారత రాజ్యాంగం కల్పించినప్పటికీ పాలక వర్గాలు ప్రజల హక్కుల్ని కాలరాస్తూనే ఉన్నాయి. రాజకీయ పార్టీలు ఓట్లకోసం యదేచ్ఛగా మతం, కులాలను వాడుకుంటున్నారు. అన్ని ప్రాంతాలకు సంపద సమాన పంపకాలు చేయటం లేదు. దేశంలో దక్షిణాది రాష్ట్రాలు సంపద సృష్టిస్తుంటే, పన్నులు చెల్లిస్తుంటే ఆ రాష్ట్రాలకు దక్కాల్సిన వాటా దక్కక పోవటం, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, రాష్ట్రాల పట్ల పక్షపాత వైఖరి అవలంబిస్తోందనే వార్త ప్రబలంగా వినిపిస్తోంది. దానివల్ల ప్రాంతీయ అసమానతలు కొనసాగుతున్నాయి. దానివల్ల రాష్ట్రాల మధ్య అంతరాలు, రాష్ట్రంలోనే వేర్వేరు ప్రాంతాల మధ్య అసమానతలు ఏర్పడుతున్నాయి. చాలా కాలంగా దక్షిణ భారతదేశంలో వచ్చిన ప్రభుత్వ ఆదాయం ఉత్తర భారత దేశంలో కేంద్ర ప్రభుత్వ అధికారంలో నున్నా రాష్ట్రాలకు దోచిపెడుతున్నారనే వివాదం కొనసాగుతూనే ఉంది. ఇది ఏదో నాటికి ముదిరి దేశ సార్వభౌమత్వానికి విఘాతం కల్గిస్తుంది. ఇప్పటికే ప్రాంతీయ అసమానతలు రాష్ట్రాల పునర్విభజన నినాదం భుజానికి ఎత్తుకున్నాయి.

పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే లక్షల కోట్ల రూపాయలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా విదేశాలకు పారిపోతున్నారు. దోపిడి యదేచ్ఛగా సాగుతోంది. అభివృద్ధిపేరుతో అటవీ సంపదను ధ్వంసం చేసి దేశ మూల వాసులను బయటకు పంపే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రశ్నించే వారిని అర్బన్ నక్సలైట్లనో, దేశద్రోహనో, రాజద్రోహులనో ముద్రవేసి జైళ్లలో కుక్కుతున్నారు. నిజాల్ని నిగ్గు తేల్చాల్సిన మీడియా ఛానల్స్ కొన్ని అధికార పార్టీల వాణిగా మారిపోతున్నాయి. మీడియా సంస్థలన్నీ పెట్టుబడిదారీ వర్గం చేతిలోపడి నిజాల్ని మింగేసి అర్థ సత్యాలను వ్యాప్తి చేస్తున్నాయి. మీడియా వాస్తవానికి సమాజానికి, రాజ్యాంగానికి కావలిదారుగా ఉండాలి, ప్రతిపక్షంగా వ్యవహరించాలి. నిజాలు బహిర్గతం చేయాలి. అలాంటిది ప్రస్తుతం గత రాజుల దగ్గర ఊదే కొమ్ము బూరలులా వ్యవహరిస్తోంది.

న్యాయవ్యవస్థ అవినీతికి అలవాలమైపోతోంది. రానురాను న్యాయవ్యవస్థ నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోతోంది. అవును మరి ఉచితంగా అందుకోవాల్సిన చదువు, ఉద్యోగం, పదోన్నతులు, బదిలీలు మొత్తం అమ్మకపు సరుకైపోయాక నిజాయితీ గురించి ఆలోచించటం అవివేకమే అవుతుంది. ఇటీవల ఒక న్యాయమూర్తి ఇంట్లో కోటాను కోట్లు అగ్నికి ఆహుతి అయిపోయాయంటే ఆ సొమ్ము ఎక్కడిది? ఏమిటో కథ సామాన్యులకు సహితం అర్థమైపోతుంది. అన్ని రంగాల్లో అవినీతి నగ్నంగా నాట్యం చేస్తోంది. ప్రభుత్వానికి తెలియదా ఎవరి నిజ వేతనాలెంతో, వారు దొడ్డిదారిన సంపాదించింది ఎంతో? స్పష్టంగా తెలుసు. వాటాలు సక్రమంగా నడిచినంతకాలం అంతా గప్చిప్. వాటాలు తెగనప్పుడే ప్రభుత్వ గుప్పిట్లో ఉన్న సంస్థల సోదాలు. ఈ విషయం ప్రజలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

మత వాదాలు ఒక పక్క పెచ్చరిల్లిపోయి మతమౌఢ్యాన్ని విస్తరిస్తున్నారు. తరుచు ఎవరే మాట మాట్లాడినా ఏదో మత ఉన్మత్తుల మనోభావాలు దెబ్బ తింటున్నాయి. ముఠాలుగా ఏర్పడి మూకదాడులు జరుగుతున్నాయి. రాజ్యం చోద్యం చూస్తోంది. వాస్తవానికి మతాలు ఎవరికి వారే సంస్కరించుకోవాలి. మతంలో నిజంగా మానవత్వం ఉంటే మానవులంతా ఆ మతంలో కలుస్తారు. కనీసం విజ్ఞులైన రాజకీయ నాయకులైనా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా అడుగు వేయగలుగుతారు. మతాల మధ్య చిచ్చు పెట్టి మంటకాగుతుంటే చివరకు లౌకికవాదం అనే పదానికి అర్థం లేకుండా పోతోంది. స్థూలంగా చెప్పాలంటే ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాస్తున్నారు. ఉపా చట్టం ప్రశ్నకు ప్రతిబంధకమవుతోంది. ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు తెగబడుతున్నాయి. రాష్ట్రంలో ఏసీబీ, సీఐడీ, కేంద్రంలో సీబీఐ, ఐటీ, ఈడీ దుర్వినియోగం అవుతున్నాయి. అవినీతి ప్రథమ స్థానానికి పోటీ పడుతోంది. అన్ని ప్రభుత్వాల్లోనూ సగానికి పైచిలుకు నేర చరితులే భర్తీ అవుతున్నారు. ఏ రాజకీయ పక్షాలకు దీనిలో మినహాయింపులేదు. ఏ నాయకుడికి రక్షణ లేకుండా పౌర సమాజంలో తిరిగే ధైర్యం ఉండటం లేదు. దానికి కారణం ప్రజలు ఏమైనా చేస్తారేమోనని కాదు. కేవలం చేసిన వాగ్దానాలు ఏమి చేసావని ప్రశ్నిస్తారేమోనని భయపడుతున్నారు. ఇప్పటి ఈ పరిస్థితుల్లో ప్రజలే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, న్యాయ వ్యవస్థను, విద్యా వ్యవస్థను రక్షించుకోవలసిన అవసరం ఉంది. విద్యార్థులు, యువకులు అన్ని విషయాలు కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని పక్కనపెట్టి చర్చించాల్సి ఉంది. వారే భావితభారత పౌరులు.

సెల్:9849579569

రాజ్యసభ అంటే భూపేశ్

ఆర్వీ రామారావ్

కొన్ని వ్యవస్థలను గుర్తు చేసుకుంటే దానికి ప్రతీకగా కొందరు వ్యక్తులే గుర్తుకొస్తారు. సీపీఐ నాయకుడు భూపేశ్ గుప్తా సరిగ్గా అలాంటి వారే. రాజ్యసభ అనగానే భూపేశ్ గుప్తా గుర్తు రాకుండా ఉండరు. రాజ్యసభకు సంబంధించినంత మేరకు ఆయన రాజ్యసభ చరిత్రే. రాజ్యసభ ఏర్పడినప్పటి నుంచి తాను మరణించేదాకా భూపేశ్ ఆ సభ సభ్యుడిగానే ఉన్నారు. 1952 మే 13న రాజ్యసభలో ప్రవేశించి 1981లో తుది శ్వాస విడిచేదాకా ఆ సభ సభ్యుడిగా కొనసాగారు. ప్రజోద్యమాలతో ఎక్కువ సంబంధం ఉన్నవారు కాకపోయినా పార్లమెంటు ఎగువ సభలో అనునిత్యం ప్రజాసమస్యలనే భూపేశ్ గుప్తా లేవనెత్తేవారు. సామాన్య జనం వాణిగా కొనసాగారు. పార్లమెంటులో ఆయన మాట్లాడుతుంటే ఆపే సాహసం ఎవరూ చేసేవారు కాదు. మొట్టమొదటి రాజ్యసభకు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షులుగా ఉండేవారు. భూపేశ్‌కు వినికిడి సమస్య ఉండడంవల్ల చెవికి ఓ చిన్న పరికరం తగిలించుకునేవారు. అయితే తాను మాట్లాడుతున్నప్పుడు ఆ పరికరం తీసేసి మాట్లాడేవారు. ఆ సమయంలో సభాధ్యక్షులైన రాధాకృష్ణను నవ్వుతూ "నీ ఎత్తుగడ నాకు తెలుసు. చెవిలో ఆ పరికరం పెట్టుకో" అనేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఎప్పుడు ఆయన పేరు ప్రస్తావించినా "అణచడం వీలు కాని భూపేశ్" అనే రాసేది. భూపేశ్ గుప్తా మాట్లాడుతునారంటే అప్పటి ప్రధానమంత్రి పండిత్ నెహ్రూ ఎక్కడున్నా సభలోకి పరుగెత్తుకొచ్చే వారు. భూపేశ్ వరసగా అయిదు సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. మొత్తం 29 ఏళ్లు ఎగువ సభ సభ్యుడిగా ఉన్నారు. సీపీఐ అంటే అభిమానం లేని పార్టీల నాయకులు కూడా భూపేశ్‌ను గౌరవించేవారు. అటల్ బిహారీ వాజపేయి విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు కూడా సభలోకి ప్రవేశించగానే ముందు భూపేశ్ కూర్చునే చోటికి వెళ్లి ఆయనకు సాదరంగా నమస్కరించి గాని తన స్థానంలో కూర్చునేవారు కాదు. శ్రీపాద అమృత డాంగే, ఎ.కె.గోపాలన్, హిరేన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తాలు కూడా మేటి పార్లమెంటేరియన్లుగా పేరుంది. కానీ భూపేశ్ వారందరికన్నా ఎక్కువ మన్నన పొందారు. ఆయనను వ్యక్తిగా కాకుండా రాజ్యసభకు ప్రతి రూపంగా చూసే వారు.



1914 అక్టోబర్ 20న ప్రస్తుత బంగ్లాదేశ్ లోని మైమెన్ సింగ్ జిల్లా ఇత్నాలో జన్మించిన భూపేశ్ చిన్న వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలోకి దూకారు. "అనుశీలన్" అనే బృందంలో చురుకుగా పాల్గొనే వారు. మొట్ట మొదట ఆయనను 1930లో, ఆ తరవాత 1931లో రెండు సార్లు అరెస్టు చేశారు. మళ్లీ 1933లో అరెస్టు చేసి 1937 దాకా జైలులో ఉంచారు. జైలులో ఉన్నప్పుడే ఆయన బి.ఎ.దాకా చదువు పూర్తి చేశారు. విప్లవ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం కోసం భూపేశ్ తండ్రి ఆయనను ఇంగ్లండ్ పంపిస్తే అక్కడా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న భారతీయ విద్యార్థులతో కలిసి ఆందోళన చేసేవారు. బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు పెట్టుకుని అందులో భారత విద్యార్థులతో కలిసి పని చేశారు. న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు.

1943లో బెంగాల్ కరవు వచ్చినప్పుడు జన రక్షా సమితి కార్యదర్శిగా బాధితుల పునరావాసం కోసం చాలా కృషి చేశారు. తెభాగా ఉద్యమంలో పాల్గొన్న వారి తరఫున కేసులు వాదించారు. జంషెడ్‌పూర్‌లోని టెల్కో కార్యకర్తల తరఫున కూడా కోర్టులో వాదించారు. బెంగాల్‌లో సీపీఐ పై నిషేధం ఉన్న సమయంలో ఆయన అజ్ఞాత జీవితం గడిపారు. 1951లో మళ్లీ అరెస్టయి 1952 ఏప్రిల్ దాకా నిర్బంధంలో ఉన్నారు. 1951లో సీపీఐ నిర్వహించిన బెంగాలీ దినపత్రిక "స్వాధీనత"కు సంపాదకులుగా ఉన్నారు. 1977లో రాజ్యసభ రజతోత్సవ సమయంలో వందవ సమావేశం జరిగినప్పుడు భూపేశ్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. 1954 నుంచి 1957 దాకా ఆ తరవాత 1966 నుంచి మరణించేదాకా భూపేశ్ సీపీఐ అధికార వారపత్రిక "న్యూ ఏజ్" సంపాదకులుగా ఉన్నారు. భూపేశ్‌కు ఇతర దేశాలలో కూడా బాగా పలుకుబడి ఉండేది. 1957, 1960, 1969లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు సమావేశాలకు సీపీఐ ప్రతినిధిగా హాజరయ్యారు. అజయ్ ఘోష్ సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు చైనాలో పర్యటించిన సీపీఐ ప్రతినిధివర్గంలో భూపేశ్ కూడా ఉన్నారు. ఆ సమయంలో మావోను కలుసుకున్నారు.

జ్యోతిబసు, ఇఎంఎస్ నంబూద్రిపాద్‌లతో భూపేశ్ గుప్తా

కేంద్రానికి తలొగ్గేది లేదు

- నీట్... డీలిమిటేషన్‌పై సమాధానం ఇవ్వండి
- అమిత్ షాకు స్టాలిన్ సవాల్

తిరువళ్లూరు (తమిళనాడు): నీట్, డీలిమిటేషన్ వంటి అంశాలపై అధికార డీఎంకే తరచూ మాట్లాడటం 'మళ్లింపు వ్యూహం'గా పేర్కొంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించడాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం తప్పుపట్టారు. పాలక వర్గం నిజంగా దృష్టిని మళ్లిస్తుంటే రాష్ట్ర ప్రజలకు కేంద్రం 'స్పష్టమైన సమాధానం' ఇవ్వాలని అమిత్ షాను సవాలు చేశారు. నీట్ సహా వివిధ అంశాలపై తమిళనాడు, డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన సందర్భంగా ఇక్కడ జరిగిన బహిరంగ కార్యక్రమంలో అమిత్ షా అన్నారు. 'నీట్ లేదా త్రి భాషా విధానం, వక్ఫ్ సవరణ చట్టం లేదా డీలిమిటేషన్ కొన్ని రాష్ట్రాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మేము మాత్రమే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. దృష్టిని మళ్లించడానికి మేము ఇలా చెబుతున్నామని అమిత్ షా అన్నారు. నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే తమిళనాడు అన్ని భారతీయ రాష్ట్రాల కోసం పోరాడుతోంది. రాష్ట్రాల హక్కులను డిమాండ్ చేయడం తప్పా?' అని ప్రశ్నించారు. అధికార డీఎంకే అధ్యక్షుడు కూడా అయిన స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, రాష్ట్రం సుప్రీం కోర్టును ఆశ్రయించి... రాష్ట్ర గవర్నర్ 'ఏమీ చేయకపోవడంతో' ఆయనకు వ్యతిరేకంగా 'చారిత్రక తీర్పు' పొందింది' అని తెలిపారు. ఇది 'డీఎంకే శక్తి', ఇది దేశవ్యాప్తంగా సాకారం అయినందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి షాపై ప్రశ్నలు సంధిస్తూ... 'నీట్ మినహాయింపు ఇవ్వగలమని మీరు చెప్పగలరా, హిందీ విధించబడదని మీరు హామీ ఇవ్వగలరా, తమిళనాడుకు ఇచ్చిన (కేంద్ర) నిధులను జాబితా చేయగలరా, డీలిమిటేషన్ కారణంగా పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గదని మీరు హామీ ఇవ్వగలరా. మేము చేస్తున్నది దారి మళ్లింపు అయితే, ఈ అంశాలపై తమిళనాడు ప్రజలకు మీరు ఎందుకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదు' అని నిలదీశారు. అమిత్ షా ఏప్రిల్ 11న డీఎంకేపై విమర్శలు చేశారు. అంతే కాకుండా, ప్రతిపక్ష అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని, 2026 ఎన్నికల్లో ఎన్డీఏ గెలుస్తుందనే విశ్వాసాన్ని షా వ్యక్తం చేశారు. అయితే అది ఎప్పటికీ జరగదని స్టాలిన్ అన్నారు. 'తమిళనాడు ఎప్పుడూ ఢిల్లీకి లొంగిపోదు. మాకు అంత ప్రత్యేకమైన లక్షణం ఉంది. దాడులు, బెదిరింపుల ద్వారా ఇతర రాష్ట్రాల్లోని పార్టీలను విచ్ఛిన్నం చేసే మీ ఫార్ములా తమిళనాడులో పని చేయదు' అని ఆయన అన్నారు. షాతో సహా బీజేపీ మంత్రులు గతంలో తమిళుల గురించి చెడుగా మాట్లాడారని ఆయన ఆరోపించారు. 'తమిళ భూమి ఆత్మగౌరవం, శౌర్యం కలిగిన నేల, ఆధిపత్యాన్ని ఎప్పుడూ అనుమతించలేదు' అని తెలిపారు. 'బెదిరింపులకు లొంగిపోయే బానిసలం మేము కాదు. అమిత్ షా మాత్రమే కాదు. ఏ షా కూడా మమ్మల్ని పాలించలేరు. ఇది తమిళనాడు' అని సీఎం స్టాలిన్ అన్నారు.

జైనులు లక్ష్యంగా బీజేపీ దాడులు: అఖిలేశ్

లక్నో: ముంబైలో జైన్ దేవాలయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం కూల్చివేయడాన్ని సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఖండించారు. దేశవ్యాప్తంగా ఉన్న జైన్ సమాజాన్ని బీజేపీ ప్రభుత్వాలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'నేటి కాలంలో దేశంలో మైనారిటీగా ఉండడం శాపంగా మారుతోంది. బీజేపీ ప్రభుత్వాలు మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడంతో ప్రస్తుతం జైన సమాజం అభద్రత, అనిశ్చితిలో ఉంది. ఇది చాలా ఆందోళన కలిగిస్తోంది' అని అఖిలేశ్ యాదవ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల జైన సమాజంపై పెరుగుతున్న దాడులను ఆయన ప్రస్తావించారు. మధ్యప్రదేశ్ సింగోలి జైన సన్యాసులపై బీజేపీ నేతలు దాడి చేసిన ఘటనను అఖిలేశ్ ఉటంకించారు. ముంబైలో జైన్ దేవాలయం, వారి పవిత్ర గ్రంథాలు, విగ్రహాలు, మతపరమైన పుస్తకాలను బీజేపీ నేతలు అవమానిస్తున్నారని ఆయన ఆరోపించారు. గుజరాత్ శ్రీ గిర్నార్, శ్రీ సమ్మేద్ శికర్ జీ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుందని, ఉత్తరప్రదేశ్ బాగ్‌పత్‌లో జైన విగ్రహ ప్రతిష్ఠను బీజేపీ నేతలు అడ్డుకున్నారని ఆయన గుర్తుచేశారు. 2022లో మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లో 65 ఏళ్ల భవర్‌లాల్ జైన్ హత్యకు గురయ్యారని అఖిలేశ్ తెలిపారు. జైన సమాజం పీడీఏ (పిఛ్డా దళిత అల్పసంఖ్యాక్) కూటమిలో భాగం. ఈ సమాజంపై బీజేపీ దాడులు చేయడం అన్యాయం. జైన సమాజాన్ని నాశనం చేయాలని బీజేపీ భావిస్తోంది. జైనులపై జరిగే దాడులను తాము వ్యతిరేకిస్తున్నామని, జైనులకు తాము అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

ఎన్‌డీఎఫ్‌సీ ఎండీగా ప్రకాశ్ మగ్దుమ్ బాధ్యతలు

న్యూఢిల్లీ: నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌డీఎఫ్‌సీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌కు చెందిన సీనియర్ అధికారి ప్రకాశ్ మగ్దుమ్ బాధ్యతలు చేపట్టారు. 1999 ఐఐఎస్ బ్యాచ్‌కు చెందిన మగ్దుమ్ ప్రస్తుతం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) లో అదనపు డైరెక్టర్ జనరల్‌గా పని చేస్తున్నారు. ఎన్‌ఎఫ్‌డీసీలో మగ్దుమ్ కొత్త పాత్రను ఐదు సంవత్సరాల కాలానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది.

ఉగ్రదాడుల సూత్రధారి హర్‌ప్రీత్ అరెస్టు

చండీఘడ్: పంజాబ్‌లో ఉగ్ర కార్యకలాపాలకు ప్రధాన సూత్రధారి హర్‌ప్రీత్ (హ్యాపీ పాసియా)ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్ఓ) అధికారులు శుక్రవారం అమెరికాలో శాక్రమెంట్‌లో అరెస్టు చేశారు. రెండు అంతర్జాతీయ ఉగ్రవాదుల గ్రూపులతో ఆయనకు సంబంధాలు ఉన్నాయని, అమెరికాకు అక్రమ పద్ధతిలో వెళ్లారని ఎఫ్‌బీఐ ఎక్స్ పోస్టులో పేర్కొంది. అతను పట్టుబడకుండా ఉండేందుకు బర్నర్ ఫోన్లు ఉపయోగించారని ఎఫ్‌బీఐ పోస్టులో పేర్కొంది. హర్‌ప్రీత్ ఉగ్రచర్యలపై విచారణ చేస్తామని తెలిపింది.

ఢిల్లీలో హత్యల పరంపర

శాంతిభద్రతలపై ఆప్ ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో గురువారం ఒక్కరోజే మూడు హత్యలు జరిగాయి. దీంతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి బీజేపీ ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా మండిపడింది. సెంట్రల్ ఢిల్లీలోని నబీ కరీం ప్రాంతంలో జరిగిన చిన్న రోడ్డు ప్రమాదం తీవ్ర వాగ్వాదానికి దారి తీయడంతో మహేంద్ర అనే వ్యక్తిని లక్కీ, సాగర్ అనే ఇద్దరు సోదరులు కలిసి స్క్రూ డ్రైవర్‌తో కొట్టి చంపేశారు. వీరు ఇద్దరు పరారీలో ఉన్నారు. సెంట్రల్ ఢిల్లీలోని పంజాబీ బస్తీలో జరిగిన రెండవ ఘటనలో ఆశిష్ ఆనంద్ అనే వ్యక్తిని పథకం ప్రకారం కొందరు దుండగులు కత్తితో పొడిచి చంపారు. పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా... మిగతా వారి కోసం గాలిస్తున్నారు. మూడో ఘటన ఈశాన్య ఢిల్లీలోని సీలంపూర్‌లో చోటు చేసుకుంది. 17 ఏళ్ల బాలుడు కునాల్‌ని కత్తితో పొడిచి చంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, నిందితులను గుర్తించి అరెస్టు చేయడానికి రెండు బృందాలను నియమించామని పోలీసులు తెలిపారు. వరుస హత్యలపై సీఎం రేఖాగుప్తా స్పందించారు. హత్యలపై పోలీసు కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఢిల్లీలో శాంతిభద్రతల పరిస్థితిపై మాజీ ముఖ్యమంత్రి ఆతిశీ స్పందించారు. సీలంపూర్ హత్య దేశ రాజధానిలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో తెలియజేస్తుందన్నారు. వరుస హత్యలు జరుగుతుంటే ఢిల్లీ పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నేరాలు పెరిగిపోతున్నాయని విమర్శలు గుప్పించారు. బీజేపీ పాలనలో శాంతిభద్రతలు మెరుగుపడటం లేదని, తాము అధికారంలో ఉన్న పదేళ్లు శాంతియుత పరిస్థితులు ఉన్నాయని మాజీ సీఎం ఆతిశీ తెలిపారు.

భారతీయులే సగం మంది!

- అమెరికా వీసా రద్దుపై కేంద్రం స్పందిస్తుందా?
- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ: అమెరికా వీసా రద్దులో సగం మంది భారతీయులే ఉన్నారని... దీనిపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం స్పందిస్తుందా అని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఇటీవలి అమెరికా వీసా రద్దులలో భారతీయ విద్యార్థులు అసమానంగా ఎక్కువ శాతం ఉన్నారని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ (ఏఐఎల్ఏ) నివేదికపై శుక్రవారం కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికా ప్రభుత్వం వద్ద ఈ విషయాన్ని ప్రస్తావిస్తారా అని అన్నారు. ఏఐఎల్ఏ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఏఐఎల్ఏ పత్రికా ప్రకటనను 'ఎక్స్' వేదికగా పంచుకుంటూ, ఈ ఫలితాలు 'భారతదేశంలో మాకు ఆందోళన కలిగించే విషయం' అని అన్నారు. ఏఐఎల్ఏ నివేదిక ప్రకారం, అంతర్జాతీయ విద్యార్థులు పాల్గొన్న 327 వీసా రద్దు కేసుల్లో, 50 శాతం భారతీయ పౌరులు ఉన్నారు. రద్దుకు కారణాలు 'యాదృచ్ఛికంగా, అస్పష్టంగా కనిపిస్తున్నాయని, విద్యార్థులు, వారి కుటుంబాలలో భయం, అనిశ్చితిని పెంచుతున్నాయని అసోసియేషన్ పేర్కొంది. 'విదేశాంగ మంత్రి ఈ విషయంపై తన ఆందోళనను అమెరికా విదేశాంగ మంత్రి వద్ద లేవనెత్తుతారా?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. అమెరికా విద్య, పరిశోధన రంగానికి గణనీయమైన సహకారం అందించినప్పటికీ, వలస విధానాలను కఠినతరం చేయడం, అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థులపై పరిశీలన పెరిగిన నేపథ్యంలో ఈ నివేదిక వచ్చింది. పారదర్శకత, న్యాయబద్ధత, తగిన ప్రక్రియ గురించి పెరుగుతున్న ఆందోళనలను నివేదిక ఎత్తి చూపింది. చాలా మంది విద్యార్థులకు ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలను ఉపయోగించుకోకుండా నిరాకరించే వరకు లేదా యజమానులు వారికి సమాచారం అందించే వరకు వారి వీసాలు రద్దయ్యాయని తెలియదు. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ (డీవోఎస్), ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) వీసా రద్దు, వారి హోదా రద్దు, వారి తొలగింపు కోసం నిరసన చరిత్ర లేని అంతర్జాతీయ విద్యార్థులతో సహా దూకుడుగా లక్ష్యంగా చేసుకుంటున్నాయి' అని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ప్రకటన తెలిపింది. 'ఈ నివేదికలో... ఈ విద్యార్థులలో 50 శాతం మంది భారతదేశానికి చెందిన వారు. తరువాత 14 శాతం మంది చైనాకు చెందినవారు. ఈ డేటాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఇతర ముఖ్యమైన దేశాలలో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ ఉన్నాయి' అని ఆ ప్రకటన పేర్కొంది.

మహారాష్ట్రలో రూ.లక్ష వరకు నగదు రహిత చికిత్స

ముంబై: ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.లక్ష వరకు నగదు రహిత చికిత్స అందించనున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ప్రమాద బాధితులకు రూ.లక్ష వరకు సకాలంలో నగదు రహిత చికిత్స అందేలా చూడాలని ఆరోగ్య మంత్రి ప్రకాశ్ అబిత్కర్ అధికారులను ఆదేశించారు. ఆరోగ్య పథకాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ పథకం కింద ఉన్న ఎంప్యానెల్డ్ ఆస్పత్రుల సంఖ్యను 1,792 నుండి 4,180కి పెంచుతామని అబిత్కర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే కమిటీల ద్వారా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది. అవయవ మార్పిడి వంటి ఖరీదైన చికిత్సలు సహా ధరలు సవరించడం, ప్రాథమిక ఆరోగ్య సేవలను ఈ పథకంలో చేర్చడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకోవడానికి అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్లు అబిత్కర్ తెలిపారు. నెలలోపు నివేదిక సమర్పించాలని ఆయన కమిటీని ఆదేశించారు.

మీ దేశం సంగతి చూసుకోండి

బంగ్లాదేశ్‌కు భారత్ హితవు

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో చెలరేగిన ఆందోళనలపై బంగ్లాదేశ్‌కు చెందిన ఒక అధికారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత విదేశాంగ శాఖ స్పందించింది. అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడానికి బదులు బంగ్లా తమ దేశంలోని మైనార్టీల హక్కులు కాపాడటంపై దృష్టి సారించాలని విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ హితవు పలికారు. శుక్రవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈవిధంగా బదులిచ్చారు. బెంగాల్‌లోని పరిస్థితులపై బంగ్లాదేశ్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం ఇటీవల మాట్లాడారు. భారత్‌లోని మైనారిటీలను రక్షించేందుకు అక్కడి కేంద్రంతో పాటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై జైస్వాల్ స్పందిస్తూ 'పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఘటనలకు సంబంధించి బంగ్లా అధికారులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తు న్నాం. వారి వ్యాఖ్యలు అర్థరహితమైనవి. ఆ దేశంలోని మైనారి టీలపై జరుగుతున్న హింస గురించి భారత్ తన ఆందోళనను తెలుపుతోంది. దీంతో వారు తిరిగి మాపై ఇలాంటి నిందలు వేయడం మానుకోవాలి. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి బదులు వారు తమ సొంత దేశంలో మైనారిటీల హక్కులను కాపాడటంపై దృష్టిసారిస్తే మంచిది' అని పేర్కొన్నారు. వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ముర్షిదాబాద్ ప్రాంతంలో పోలీసు వాహనాలకు నిప్పుపెట్టడం వంటి ఘటనలతో అక్కడ విధ్వంసం చోటుచేసుకుంది. దీంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా... 200 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు.

ఇంకా నిర్ణయం తీసుకోలేదు

శాటిలైట్ టోల్ విధానంపై కేంద్రం

న్యూఢిల్లీ: ఉపగ్రహ ఆధారిత టోల్ విధానం అమలుపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. మే 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. ప్రస్తుత ఫాస్టాగ్ ఆధారిత టోల్ విధానం స్థానే శాటిలైట్ టోల్ విధానాన్ని మే 1 నుంచి అమలు చేయబోతున్నారంటూ కొన్ని మీడియా సంస్థలు వార్తలు ప్రచురించాయి. దీనిపై కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఫీజు వసూలుకు టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆపే అవసరం లేకుండా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ విధానాన్ని తొలుత ఎంపిక చేసిన టోల్‌ప్లాజాల వద్ద అమరుస్తారు. ఇందులో ఏఎన్‌పీఆర్‌తో పాటు ఫాస్టాగ్ కలగలిపి సేవలందిస్తారు. ఏఎన్‌పీఆర్ కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్లను గుర్తిస్తే... వాహనాలు ఆగకుండానే ఫాస్టాగ్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా టోల్ వసూలు చేస్తారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఇ-నోటీసులు జారీ చేస్తారు. ఫాస్టాగ్ రద్దు, పెనాల్టీలు విధిస్తారు. ఎప్పటి నుంచి అమలు చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆ శాఖ తెలిపింది.

మేము హిందువులం... హిందీ కాదు

- ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే
- హిందీ తప్పనిసరిపై విద్యార్థి విభాగం నిరసన

థానే (మహారాష్ట్ర): మరాఠీ, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల్లో విద్యార్థులకు మూడవ భాషగా హిందీని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నవీ ముంబైలో మహారాష్ట్ర నవనిర్మాణ సేనకు చెందిన విద్యార్థి విభాగానికి చెందిన కార్యకర్తలు శుక్రవారం నిరసన చేపట్టారు. వందలాది మంది నిరసనకారులు వాషిలో ఒక ప్రాంతం వద్ద ప్రభుత్వ తీర్మాన ప్రతులను తగులబెట్టడంతో పాటు బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఒక గొప్ప భాషా సంస్కృతితో కూడిన ఈ ప్రాంతంలో ఒక భాషను బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర పాలనా యంత్రాంగానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020 క్రింద నూతన పాఠ్యాంశాల అమలులో భాగంగా 1 నుంచి 5 తరగతులకు త్రిభాషా సూత్రాన్ని తీసుకువచ్చారు. పాఠశాల విద్య కోసం ఎన్‌ఈపీ 2020 సిఫార్సుల ప్రకారం నూతన పాఠ్యాంశాల కార్యాచరణ రూపకల్పన ప్రణాళికను దశలవారీగా అమలు చేస్తామని రాష్ట్ర పాఠశాల విద్యా విభాగం ప్రకటించింది. మహారాష్ట్ర నవనిర్మాణ విద్యార్థి పరిషత్ (ఎంఎన్‌వీఎస్) కార్యకర్తలు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 ఒక తప్పనిసరి పాఠ్యాంశంగా హిందీని పేర్కొనలేదని తెలిపారు. హిందీని తప్పనిసరి చేయడం సమంజసం కాదని అన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు హిందీని తప్పనిసరి పాఠ్యాంశంగా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే తీవ్రంగా వ్యతిరేకించారు. 'హిందీ జాతీయ భాష కాదు. ప్రతి రాష్ట్రానికి దాని స్వంత మాతృభాష ఉంటుంది. హిందీ వాటిలో ఒకటి మాత్రమే. మరాఠీ, హిందీ, ఆంగ్లం ప్రభుత్వ, అధికారిక పనులకు మాత్రమే ఉపయోగించాలి. ఒకరు విద్యార్థులను హిందీ నేర్చుకోవాలని బలవంతం చేయకూడదు... చేయకూడదు' అని ఠాక్రే 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎంఎన్ఎస్ ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, దానిని సహించదని ఆయన హెచ్చరించారు. 'మేము హిందువులం. హిందీ కాదు. అటువంటి నిర్ణయంతో ముందుకు సాగే ముందు ప్రభుత్వం దీనిని గుర్తుంచుకోవాలి' అని అన్నారు.

మరాఠీకే అత్యంత ప్రాధాన్యత: డిప్యూటీ సీఎం అజిత్ పవార్

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నాయకుడు అజిత్ పవార్ పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేయాలనే మహాయుతి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించడాన్ని తప్పుపట్టారు. రాష్ట్రంలో మరాఠీ ఎల్లప్పుడూ అగ్ర ప్రాధాన్యతగా ఉంటుందని పవార్ అన్నారు. పింప్రి చించ్వాడ్‌లో చాపేకర్ సోదరులకు అంకితం చేసిన స్మారక చిహ్న ప్రారంభోత్సవంలో ప్రసంగించిన పవార్... నిజమైన సమస్యలు లేకపోవడం వల్ల ప్రతిపక్షాలు ఇటువంటి అనవసరమైన సమస్యలను లేవనెత్తుతున్నాయని అన్నారు. 'మరాఠీ మన మాతృభాష. రాష్ట్రంలో ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఉంటుంది' అని పవార్ నొక్కి చెప్పారు. 'కొంతమంది హిందీ భాషపై వివాదాలు సృష్టిస్తున్నారు. ఎందుకంటే వారికి వేరే పని లేదు. దేశవ్యాప్తంగా ఇంగ్లీషు విస్తృతంగా ఉపయోగించబడుతుంది. అదే విధంగా అనేక రాష్ట్రాల్లో హిందీ మాట్లాడతారు. 'హిందీ రాష్ట్ర భాష' అనే దానిపై వివాదం ఉన్నప్పటికీ, నేను దానిలోకి ప్రవేశించ కూడదనుకుంటున్నాను' అని పవార్‌ను ఉటంకిస్తూ పీటీఐ నివేదించింది.

కులగణనతోనే అర్హులకు సంక్షేమ ఫలాలు

టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

చెన్నై: రాష్ట్రంలో కులగణన నిర్వహించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు కే సెల్వపెరుంతగై డీఎంకే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు సరైన నిష్పత్తిలో అర్హులైన పౌరులకు చేరేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయం వ్యక్తపర్చారు. కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల్లో కుల గణనకు మొగ్గు చూపడం గురించి ప్రశ్నించగా... నిజానికి కేంద్రం కుల గణన నిర్వహించాలి. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు కుల సర్వేతో ముందుకు సాగవచ్చనేది తమ పార్టీ వైఖరి అన్నారు. 2006-11 కాలంలో కాంగ్రెస్ పార్టీ తరచుగా వినిపించిన 'అధికారంలో వాటా' అనే నినాదం ఇప్పుడు కూడా కొనసాగుతుందా అని అడిగినప్పుడు... ఇది విధానపరమైన విషయమని ఆయన అన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే కూటమిలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉంది. రానున్న ఎన్నికల్లో మిత్రపక్షం (డీఎంకే) నుంచి ఎన్ని సీట్లు ఆశించాలి... అధికారంలో వాటా కోరాలా వద్దా అనే విషయాలను ఏఐసీసీ నిర్ణయిస్తుందని ఆయన అన్నారు. పార్టీ రాష్ట్ర విభాగం సలహాలు, సూచనలు ఇచ్చినప్పటికీ అటువంటి అంశాలపై జాతీయ నాయకత్వం మాత్రమే నిర్ణయం తీసుకోగలదని స్పష్టం చేశారు. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఇటీవల పార్టీ నాయకుడొకరు సెల్వపెరుంతగైని '2026 డిప్యూటీ సీఎం' అంటూ ప్రశంసించారు. అధికార డీఎంకేతో మితిమీరిన స్నేహపూర్వకంగా ఉన్నారని పార్టీలోని కొన్ని వర్గాల నుండి వచ్చిన విమర్శలపై స్పందిస్తూ... సిద్ధాంతపరంగా నడిచే కాంగ్రెస్, డీఎంకే కూటమి నిరంతర ఎన్నికల విజయాలతో ముందుకుపోతోందన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో కూడా 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయవంతమైందని చెప్పారు. 2019లో ప్రధానమంత్రి పదవికి రాహుల్ గాంధీ పేరును తొలిసారిగా ప్రతిపాదించింది డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ అని గుర్తు చేస్తూ... డీఎంకే నాయకత్వంతో నిజమైన స్నేహాన్ని కొనసాగించడం సరైనది కాదా అని సెల్వపెరుంతగై ఆశ్చర్యపోయారు. విమర్శలు పక్షపాతంతో కూడుకున్నవని కొట్టిపారేశారు. అదే సమయంలో ఆస్తి, మోటారు వాహనాల పన్నుల పెంపు, విద్యుత్ చార్జీల పెంపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో విఫలం కాలేదన్నారు. కొన్ని బిల్లులను అసెంబ్లీలో తన పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిందని చెప్పారు. తన నియోజకవర్గానికి సంబంధించిన అంశాలను కూడా సభలో తీవ్రంగా లేవనెత్తినట్లు పేర్కొన్నారు. "ప్రజల హక్కుల కోసం పోరాడే విషయంలో మాది మొదటి స్వరం. డీఎంకేతో స్నేహం భిన్నంగా ఉంటుంది." అని చెప్పారు. మహిళలు, హిందూ మత చిహ్నాలపై మంత్రి కె.పొన్ముడి చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను పార్టీ కూడా వ్యతిరేకించిందన్నారు. పొన్ముడిని తన పదవికి రాజీనామా చేయమని అడుగుతారా అని ప్రశ్నించగా... కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే చర్య తీసుకోవాలని డిమాండ్ చేసిందని, మంత్రిని తన పార్టీ పదవి నుండి తొలగించారని ఆయన అన్నారు.

బీజేపీ కొత్త అధ్యక్షుడిపై మల్లగుల్లాలు

కేంద్ర కేబినెట్ విస్తరణపై ఊహాగానాలు

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికపై ఆ పార్టీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అనేకసార్లు సమావేశమై చర్చించారు. ఏప్రిల్ 22, 23 తేదీల్లో ప్రధాని మోదీ సౌదీ అరేబియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బీజేపీ అధ్యక్షుడి ఎన్నికతో పాటు కేంద్ర కేబినెట్ విస్తరణ కూడా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ అధ్యక్ష రేసులో కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. ఎక్కువగా మనోహర్ లాల్ ఖట్టర్‌కు అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రధాని మోదీతో ఖట్టర్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆయనకు ఎక్కువ అవకాశాలు ఉండవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర కేబినెట్ విస్తరణ చేస్తారని ప్రచారం జరుగుతోంది. కేబినెట్‌లో ఎన్డీఏ మిత్రపక్షాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వొచ్చని సమాచారం. ఎన్‌సీపీ, శివసేనతో పాటు బీహార్‌లోని ఇతర మిత్రపక్షాలకు చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది. బీహార్ నుంచి ఉపేంద్ర కుష్వాహా వంటి నేతకు కేబినెట్‌లో చోటు లభించవచ్చంటున్నారు.

ప్రలోభాలకు లొంగే ఓటర్లు జంతువులై పుడతారు: బీజేపీ ఎమ్మెల్యే

భోపాల్: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యే వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. డబ్బు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాలకు లొంగే ఓటర్లు మరో జన్మలో జంతువులుగా పుడతారని, దేవుడితో తాను ప్రత్యక్షంగా మాట్లాడతానని చెప్పారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆ బీజేపీ ఎమ్మెల్యేపై విమర్శలు వెల్లువెత్తాయి. వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 16న మోవ్ అసెంబ్లీ నియోజకవర్గం హసల్‌పూర్ గ్రామంలో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఉషా ఠాకూర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల ద్వారా ప్రతి లబ్ధిదారుడి ఖాతాల్లోకి వేల రూపాయలు వస్తున్నాయని తెలిపారు. అయినా కూడా ఓటు అమ్ముకుంటే అది మనుషులకే సిగ్గుచేటని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజలను ఉషా ఠాకూర్ కోరారు. ఓటు వేసేటప్పుడు చిత్తశుద్ధిని కోల్పోవద్దని చెప్పారు. 'డబ్బు, చీరలు, గాజులు, మద్యం తీసుకుని ఓటు వేసే వారు వచ్చే జన్మలో కచ్చితంగా ఒంటెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు అవుతారు. ఇది మీ డైరీలో రాసుకోండి. దేవుడితో నాకు ప్రత్యక్ష సంభాషణ ఉంది. నన్ను నమ్మండి' అని అన్నారు. దేశం, మతం, సంస్కృతికి సేవ చేసే బీజేపీకి మాత్రమే ఓటు వేయాలని కోరారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి.

'మాంసాహారం'పై మరాఠీలకు... గుజరాతీలకు గొడవ

ముంబై: ఘట్కోపర్ పరిసరాల్లో మాంసాహారం తీసుకుంటున్నారనే ఆరోపణలపై గుజరాతీ సమాజ సభ్యులకు, మరాఠీ మాట్లాడే నివాసితులకు మధ్య గురువారం తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ముంబై పోలీసులు జోక్యం చేసుకోవలసి వచ్చింది. మరాఠీ మాట్లాడే పొరుగువారిని మాంసాహారం తిన్నందుకు అవమానించారనే ఆరోపణలతో మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) కార్యకర్తలు కూడా హౌసింగ్ సొసైటీ సభ్యులతో వాదనకు దిగారు. తరువాత, మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ మాట్లాడుతూ భాష ఆధారంగా ఇటువంటి 'అగౌరవమైన' సంఘటనలు ఆమోదయోగ్యం కాదని అన్నారు. బుధవారం సొసైటీలోని గుజరాతీ నివాసితులకు ఎంఎన్ఎస్ కార్యకర్తలు హెచ్చరిక జారీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రసారమైంది. కాగా, మరాఠీ మాట్లాడే పొరుగువారితో దురుసుగా ప్రవర్తించవద్దని పోలీసులు సొసైటీ నివాసితులను కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. ఈ సంఘటనపై పోలీసు స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని ఒక పోలీసు అధికారి పీటీఐకి తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సీఎంపై కేటీఆర్‌కు ఎందుకంత అక్కసు : ఎంపీ మల్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీఎం.రేవంత్‌రెడ్డి పై కేటీఆర్‌కు ఎందుకంత అక్కసో అర్థం కావడం లేదని ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజల తిరుగు బాటుతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయిందని అయినా వారిలో ఇంకా మార్పు కనిపించడం లేదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పదేళ్ల పాలనలో బంగారు తెలంగాణ కాస్తా బంగారు కేసిఆర్ కుటుంబంగా మారిందని ఎద్దేవ చేశారు. ప్రతిపక్షాలు రాత్రింబవళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో ప్రజలు తిరిగిపడినట్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేయనటువంటి పనులను సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని, దేశ చరిత్రలో మొదటిసారిగా పేదల కోసం సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అలాగే సమీకృత గురుకుల పాఠశాలలను రూ.200 కోట్లతో రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని, ప్రపంచ స్థాయి విద్య, మౌలిక సదుపాయాలను రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారని వివరించారు. ప్రపంచస్థాయి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను రేవంత్ రెడ్డి, మంత్రులు బృందం తీసుకొచ్చిందని, లక్ష మంది ఉద్యోగులలో బీసీ కుల గణనను చేసి చట్టబద్ధత కల్పించారని చెప్పుకొచ్చారు. రైతులు, అధికారుల మేలు కోసం భూభారతిని సీఎం రేవంత్, మంత్రులు బృందం తీసుకొచ్చిందని అన్నారు. ప్రగతి భవన్‌లో ప్రజలు కనపడకుండా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారని కాని రేవంత్ హయంలో ప్రగతి భవన్ గేట్లు బద్దలు కొట్టి ప్రజలు వెళ్లేందుకు విలు కల్పించారన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నరలో 60 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని, ప్రజాపాలన కేంద్రంగా రేవంత్ రెడ్డి పాలన సాగుతుందని అయన గుర్తు చేశారు.

అభివృద్ధి అడ్డుకోవడమే మీ విధానం : చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : హెచ్‌సీయూ భూముల అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు ఎక్స్ వేదికగా ఎంపీ.చామల కిరణ్‌కుమార్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ట్విట్ అయన చురకలు అంటించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ట్విట్టర్ ద్వారా స్పందించిన కేటీఆర్‌కు ధన్యావాదాలు అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మొదటగా అయన ఐటీ పరిశ్రమలు రాష్ట్రానికి రాకుండా అడ్డుకున్నందుకు, తెలంగాణ యువతకు ఉపాధి, ఉద్యోగాలను రాకుండా అడ్డుకున్నందుకు, తాను క్రియేట్ చేయించిన ఏఐ ఫేక్ వీడియోలను విస్తృత ప్రచారం చేసి ప్రజలను నమ్మించి నందుకు కేటీఆర్‌కు ధన్యావాధాలు అంటూ పేర్కొన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు నిధులు రాకుండా అడ్డుకున్నందుకు, నిధులు పుష్కలంగా వస్తే ప్రజా సంక్షేమాన్ని ఇనుమడించితే, రేవంత్ సర్కారుకు మంచి పేరు వస్తుందని, అది రాకుండా అడ్డుకున్నందుకు, మొత్తంమీద తెలంగాణలో రేవంత్ సర్కారు కాళ్లల్లో కట్టె పెట్టడంలో ప్రధాని మోదీని కలిసి రమ్మనందుకు కేటీఆర్‌కు ధన్యవాదాలు అంటూ చామల తనదైన శైలీలో కేటీఆర్ పై విమర్శలు చేశారు.

వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన సీపీ



విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషనలలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి కమిషనర్ సుధీర్ బాబు శుక్రవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పని తీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఎమ్మెల్యే మర్రి చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అపర భగీరధుడు మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖరుడని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా మహేంద్ర హిల్స్ రిజర్వాయర్ నిర్మాణం గురించి చేపట్టిన కల ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితోనే సాధ్యమైందని ఆమె వెల్లడించారు. మహేంద్ర హిల్స్‌లో 14 కోట్ల 95 లక్షల రూపాయల రిజర్వాయర్ నిర్మాణానికి జీవో కాపీ మంజూరు కావడంతో శుక్రవారం గౌతమ్ నగర్‌లో మర్రి రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ ఉన్న 33 కాలనీలకు 5 ఎంఎల్ నీటిని అందించడానికి రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందన్నారు. రిజర్వాయర్ మంజూరుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. త్వరలో మహేంద్ర హిల్స్‌లో రిజర్వాయర్ నిర్మాణం జరగబోతుందని ఆమె తెలిపారు. త్వరలో రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి రిజర్వాయర్ నుండి గౌతమ్ నగర్ డివిజన్‌లో ఉన్న 33 కాలనీలకు 5 ఎంఎల్ నీటిని అందించడానికి సాయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు. రిజర్వాయర్ మంజూరు వల్ల తమ చిరకాల కోరిక నెరవేరిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రిజర్వాయర్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దీనిలో భాగంగా బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ వివాదాలు సరళతరం చేయడానికి భూ భారతి

కలెక్టర్ గౌతం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారాలు సరళతరం చేయడానికి ఎంతగానో దోహదపడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు, రైతు సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలకు భూ వివాదాల సత్వర పరిష్కారానికి 'భూ భారతి' అవగాహన సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టంలోని నిబంధనలపై అవగాహన తీసుకురావడానికి అవాంతరాలు లేని సేవలను విస్తరించడం కోసం పౌరులు, రైతులు, రైతు సంఘాలు ఎన్.జి.ఓలు, ప్రజాప్రతినిధులు మొదలైన వారితో అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలియజేసారు. ఇందుకు గాను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మండల స్థాయిలో ఈ 19 నుండి 26 వరకు ఈ అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 19న మూడు చింతలపల్లిలోని కేశవరం గ్రామంలోని సూపర్ సంగీత్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటల నుండి అవగాహన సదస్సు ఉంటుందని వివరించారు. ఈ అవగాహన సదస్సులో ప్రజలు, రైతులు, రైతు సంఘాలు ఎన్.జి.ఓలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్ చట్టంపై అవగాహన పొందాలని కలెక్టరు కోరారు.

కుల, మత రాజకీయాలకు కాలం చెల్లింది

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇన్నేళ్ళ పాటు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన ప్రస్తుత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అలియాస్ కిస్మత్ రెడ్డి అసలు తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంపీగా అంబర్ పేట నియోజకవర్గానికి అయన ఏం చేశారు అని నిలదీశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది అనుకోవడం వారి పగటి కల అని, నిధుల సంగతి దేవుడెరుగు ప్రధానిని కలిసి రాష్ట్ర అభివృద్ధి గురించి ఒక్కసారైనా మాట్లాడారా అంటూ ధ్వజమెత్తారు. ఎన్నికలు రాగానే బీజేపీ బీఆర్ఎస్ పార్టీ ప్రేమ చిగురించడం పరిపాటిగా మారిందని, తిరిగి ఎన్నికలు అయిపోగానే బద్ద శత్రువుల్లా బీజేపి బీఆర్ఎస్ నేతల డ్రామాలు అడుతున్నారని దుయ్యబట్టారు. మేము మీలాగా రహస్య ప్రేమను నడపడం మాకు మా పార్టీకి అలవాటు లేదన్నారు. కిషన్ రెడ్డి పొద్దున లేస్తే అక్బర్ ఉద్దీన్ ఓవైసీ జపం చేస్తారని, గత జన్మలో ఇద్దరు అన్నదమ్ములు అనుకుంటా అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలకు మతం తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రజాకార్ల రాజ్యం ఎందుకు వస్తుందో కిస్మత్‌రెడ్డికి తెలియాలని అన్నారు. కేంద్ర మంత్రిగా దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, సన్నబియ్యం లాంటి చారిత్రాత్మక నిర్ణయాలను తెలంగాణలో అమలు చేస్తే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ముందుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం పంపిణీని చేసి అక్కడ మోదీ ఫోటో వేసుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడలేదో ముందు చెప్పాలని నిలదీశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీతో రహస్య ఒప్పందం నిజంకాదా అనే విషయంలో కిషన్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలన్నారు. సంఖ్యాబలం లేని మీరు ఎవరి ప్రేమ అండదండలు చూసుకుని పోటీ చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. మాకు సంఖ్యా బలం లేదు కాబట్టే ఎన్నికలకు దూరంగా ఉన్నామని, రాజకీయ అవసరాల బట్టి లోకల్ బాడి ఎన్నికల్లో మద్దతు గురించి ఆలోచిస్తామని స్పష్టం చేశారు. కులం మతం రాజకీయాలకు కాలం చెల్లిందని, ఎవరికి తొత్తుగా ఉండాల్సిన అవసరం మాకు లేదు కాబట్టే మేము గత అసెంబ్లీ, లోకసభ, ఎన్నికల్లో పోటీ చేసి గెలిచామని వివరించారు. మూసీ గురించి మాట్లాడే బీజేపి నేతలు సబర్మతి నది గురించి ఎందుకు మాట్లాడరని అడిగారు. మెట్రో రైలు విస్తరణపై మీకు బాధ్యత లేదా, నగర ఎంపీగా సహాయ సహకారాలు అందించాల్సిన మీరు దాని గురించి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మేము మా సీఎం, మంత్రులు ప్రధానిని కలవడానికి వస్తారు మరి మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. హేటచ్‌సీయూ భూముల్లో పారిశ్రామిక ప్రగతి అభివృద్ధి జరిగితే యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని, రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్రాభివృద్ధికి సహకరించాల్సింది పోయి ఇలా అడుగడుగునా అడ్డుపడడానికి కిషన్ రెడ్డికి సిగ్గుండాలంటూ ధ్వజమెత్తారు. డిల్లీలో బీసీల పక్షాన ధర్నాకు చేపడితే హాజరుకాని వారి గురించి మాట్లాడదానికి బీజేపీ నేతలకు అర్హత లేదన్నారు. బీసీ బిడ్డలైన ఈటల రాజేందర్, బండి సంజయ్ బీసీల 42 శాతం రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలన్నారు. మజ్లిస్ పార్టీని

అక్కసుతో గ్రూప్-1పై బీఆర్ఎస్ కేసులు : బల్మూరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో నిరుద్యోగుల కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నేతలకు కడుపు మండి గ్రూప్ 1 పై వరుసగా కేసులు వస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. పదేళ్ళ కాలంలో వారు చేయలేని పనులు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని వారు ఇలా తమ అక్కసును వెళ్ళగక్కు తున్నారని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయాని కోరుతూ సీఎం.రేవంత్‌రెడ్డికి వ్రాసిన లేఖ పై స్పందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నూతన ప్రభుత్వం ఇప్పటి వరకు 57వేల ఉద్యోగాలను భర్తి చేసినట్లు వెల్లడిరచారు. గతంలో తాను ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడుగా పోరాటం చేసి, నోటిఫికేషన్లు వేయాలని పోరాటం చేసి గ్రూప్ 1లో జరిగిన అవకతవకలపై న్యాయ స్థానం ఆశ్రయిస్తే, భయంతో చేసిన తప్పును బీఆర్ఎస్ ప్రభుత్వం, టిఎస్‌పీఎస్సీ అధికారులు ఒప్పుకున్నారు, పరీక్షలు రద్దు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎప్పుడూ విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయలేదని స్పష్టం చేశారు. ఇపుడు నిరుద్యోగుల గురించి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత గత పదేళ్లు ఎక్కడ ఉన్నారో ఎవ్వరికీ తెలియదన్నారు. టిఎస్‌సీఎస్‌సీ పేపర్లు లీకు అయినప్పుడు, ఇంటర్ పేపర్లు లీకు అయితే, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే కవిత కనీసం పరామర్శించిన పాపాన పోలేదని మండిపడ్డారు. అప్పుడు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ బిజినెస్‌లో బీజీగా ఉన్నారంటూ ఎద్దెవ చేశారు. టీజీపీఎస్సీ పరీక్షల సెంటర్ల ఏర్పాటు, విషయంలో కమీషన్ ప్రమేయం ఉండదని, అలాగే ప్రభుత్వ ప్రమేయం ఉండదని, పబ్లిక్ డొమైన్ లో ఉన్నా సమాచారాన్ని కూడా కవిత తప్పుగా చెప్పుతూ, నిరుద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. విమెన్ సెంటర్ విషయంలో కవిత తప్పుడు లెక్కలు చెప్పటం హాస్యపదంగా వుందని, కోఠి సెంటర్‌లో మాల్ ప్రాక్టీస్ జరిగింది అని చెబుతున్నారు, నిజంగా జరిగితే తోటి విద్యార్థులు ఎందుకు బయట చెప్పలేదని నిలదీశారు. బీఆర్ఎస్‌లో కవిత, కేటీఆర్ ఒకరికి ఒకరితో పోటీ పడుతున్నారని అన్నారు. నిజంగా కవిత వద్ద అమె చేస్తున్న ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఉంటే కవితను మేమే ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడిస్తామన్నారు.

పార్లమెంటరీ కమిటీ సిఫారసులు వెంటనే అమలు పరచాలి

తాటిపాముల వెంకట్రాములు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ పథకం కింద పని చేసే ఉపాధి కూలీలకు పని దినాల సంఖ్యను 150 రోజులకు పెంచాలని, వేతనాలను రోజు కూలి కనీసం 400 రూపాయలకు పెంచాలని గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సులను తక్షణమే ఆమోదించి అమలు జరపాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాతావరణ విపత్తు కరువు ఉపశమన నిబంధన కింద, అడవి ప్రాంతాల్లో షెడ్యూల్ తెగల కుటుంబాలకు ఉపాధిహామీ పథకం కింద 200 రోజులు పనులు కలిగించాలని చేసిన సిఫార్సుల అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం కూలీలకు ఇస్తున్న కూలీ రోజు వారి ఖర్చులకు ఏమాత్రం సరిపోవడం లేదని చెప్తూనే కూలీని రూ.400 అందించాలని సిఫారస్ చేయడం అన్యాయమని కనీసం 700 రూపాయలు ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే పార్లమెంటరీ కమిటీ స్పందించకపోవడం విచారకరమన్నారు. ఆధార్ వివరాలలో చిన్న అక్షర లోపాల సాకుతో కోట్లాది కూలీల జాబు కార్డుల తొలగించడం సరైనది కాదని అర్హత కలిగిన కూలీలందరికీ జాబ్ కార్డులు ఇచ్చి పని కలిపించాలని కమిటీ సిఫార్సు చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పేదల వ్యతిరేక విధానాన్ని విడనాడి ఉపాధి హామీ పథకానికి తగిన విధంగా నిధులు పెంచి పనులు కలిగించాలని వేతనాలు జాప్యం లేకుండా వారానికి ఒకసారి చెల్లించాలని, పట్టణ ప్రాంతాలకు ఉపాధిహామీ పథకాన్ని వర్తింపజేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. లేనిచో దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

కాచిగూడలోని రైల్ మ్యూజియం ప్రపంచ వారసత్వ దినోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాఠశాల పిల్లలు, రైలు వినియోగదారులు, రైలు ఔత్సాహికులకు శుక్రవారం ఉచిత ప్రవేశంకల్పించారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం, మన సాంస్కృతిక సహజ సంపదను కాపాడుకోవడం ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేస్తుంది. నేడు "ప్రపంచ వారసత్వ దినోత్సవం" సందర్భంగా కాచిగూడలోని రైల్ మ్యూజియం పాఠశాలలు కళాశాలల విద్యార్థులు, రైలు ప్రయాణికులు, రైలు ఔత్సాహికులకు ఉచిత ప్రవేశాన్ని కల్పించింది. ఈ రైల్ మ్యూజియం గతంలో పని చేసే రైల్వే పరికరాలు, రైల్వే నమూనాలు, లివర్ల పని వ్యవస్థ, సిగ్నల్ వ్యవస్థలు మొదలైన వాటి పాత సాంకేతిక నమూనాలను ప్రదర్శిస్తుంది. 1960 నుండి నేటి వరకు దశాబ్దాల వారీగా ఉపయోగించిన ఫ్యాన్లు ప్రదర్శనలో ప్రదర్శించబడ్డాయి, సందర్శకులలో మరింత ఆసక్తిని కలిగించాయి. 1916లో నిజాంలు కాచిగూడ స్టేషన్ ప్రారంభోత్సవం ఫోటో వారసత్వ ప్రేమికులకు ఆకర్షణీయమైన దృష్టిని ఆకర్షించింది. కాచిగూడ రైల్వే స్టేషన్ భవనం 1916లో నిర్మించబడింది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ ధృవపత్రాల ద్వారా ప్లాటినం అవార్డుతో సత్కరించబడింది. కాచిగూడలోని ఈ రైల్ మ్యూజియం నిజాం కాలం నాటి రైల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన పాతకాలపు ఛాయాచిత్రాలు, ప్రదర్శనలను అందిస్తుంది. స్వాతంత్ర్యానికి ముందు యుగం నుండి వివిధ పరికరాలు కాచిగూడలోని రైల్ మ్యూజియం రైల్వేల లోగోలు మ్యూజియం లో ప్రదర్శించబడతాయి. ప్రదర్శనలలో సిగ్నలింగ్ పరికరాలు, వివిధ లోకోమోటివ్‌లు, కోచ్‌ల నమూనాలు, టిక్కెట్లు, పని నమూనాలు మొదలైనవి ఉన్నాయి. రైల్వేల చరిత్ర వృద్ధికి సంబంధించిన ఆడియో-విజువల్‌లు, రైల్వేలకు సంబంధించిన వివిధ అంశాలపై ఇతర లఘు చిత్రాలను ప్రదర్శించడానికి ఒక ప్రత్యేక ప్రదర్శన ప్రాంతం అందుబాటులో ఉంది.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు జిహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ లో ఒక్కసారిగా ఈదురు గాలులు భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. వర్షపాతం ప్రభావం జీహెచ్ఎంసీ ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఒక్కసారిగా ఈదురు గాలులతో నగరంలో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగినట్టు అధికారులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఎమర్జెన్సీ టీమ్స్ డిఆర్ఎఫ్ బృందాలు విరిగిన చెట్లను తొలగించాలని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో చార్మినార్ బహదూర్ పుర, నాంపల్లి, అంబర్పేట్, ఖైరతాబాద్, ఎల్బీనగర్, కూకట్పల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షపాత ప్రభావం ఉందని వెల్లడించారు. వర్షానికి నగరంలో ఉన్న వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెంట వెంటనే నీటిని తొలగించాలని ఆదేశించారు. వచ్చే మూడు గంటల్లో నగరంలో మరోసారి భారీ వర్షం పడనుందని వాతావరణ శాఖ అధికారులు సూచించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా జలమండలి జెట్టింగ్ మిషన్స్ ద్వారా అరికడుతున్నాయి. పోలీస్, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకొని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

టీజీ ఈఏపిసెట్-2025 పరీక్షల షెడ్యూల్ విడుదల

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ అడ్మిషన్లకు సంబంధించిన కామన్ ఎంట్రెన్స్ పరీక్షల షెడ్యూలు విడుదల్కెంది. టీజీఈఏపిసెట్ -2025 ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి ప్రారంభం అవుతాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణ రెడ్డి తెలిపారు. 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ఉండనున్నాయి. ఉదయం సెషన్ 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉంటాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు హాల్ టికెట్లు ఏప్రిల్ 19 నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఇంజినీరింగ్ పరీక్షలు మే 2 నుండి 4 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ పరీక్షలకు ఈ నెల 22 నుండి హాల్ టికెట్ల డౌన్లోడ్ చేసుకో వచ్చు. ఉదయం సెషన్ 7 గంటల 30 నిమిషాల నుండి, మధ్యాహ్నం సెషన్ 1 గంట 30 నిమిషాల వరకు ఉంటుంది. ఎంట్రెన్స్ పరీక్షల సమయంలో ఒక్క నిమిషం నిబంధన అమలు లో ఉంటుందని జెఎన్‌టియు డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు. ఇప్పటివరకు ఇంజినీరింగ్ కోసం 2 లక్షల 19 వేల 420 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీకి 86 వేల 101 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు కలిపి 2 లక్షల 53 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా పరీక్షా కేంద్రాలను 16 జోన్లుగా విభజించారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల కోసం మొత్తం 112 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ పరీక్షల కొరకు మొత్తం 124 సెంటర్ల ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా జెఎన్‌టియు డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే సెంటర్లను పర్యవేక్షించామని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలి



విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంటు నగర పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు టిడిపి సికింద్రాబాద్ పార్లమెంటు అధ్యక్షులు సాయిబాబా తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తమ తమ నియోజకవర్గ, డివిజన్ ప్రాంతాలలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి, దగ్గరలో ఉన్న దేవాలయాలలో చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాక్షిస్తూ అర్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించాలని, మసీదు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు చేపట్టిన కార్యక్రమ వివరాలను ఫోటోతో పాటు జిల్లా పార్టీ కార్యాలయం 9989511065 వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ రావు నగర్‌లో ఆకాష్ ఇనిస్టిట్యూట్ బ్రాంచ్ ప్రారంభం

విశాలాంధ్ర - కాప్రా : డాక్టర్ ఏఎస్ రావునగర్ అనుపురం కాలనీలో ఆకాష్ ఇనిస్టిట్యూట్ 15వ బ్రాంచ్‌ను శుక్రవారం ఆకాష్ ఇనిస్టిట్యూట్ తెలంగాణ స్టేట్ హెడ్ అమిత్ కుమార్ ఉరిటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాష్ ఇనిస్టిట్యూట్స్ దేశంలో 340 బ్రాంచులు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం 14 బ్రాంచ్ లు ఉన్నాయని, విద్యార్థుల డిమాండ్ మేరకు ఏఎస్ రావు నగర్‌లో 15వ బ్రాంచ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే జేఈఈ, నీట్ కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు ముఖ్యంగా ఎనిమిది తొమ్మిది పది తరగతులలో నీట్ జెఈఈ ఫౌండేషన్ కోర్సుకు ఏఎస్ రావునగర్ బ్రాంచ్ లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు నీట్, జెఈఈ కోర్సులలో రెండు సంవత్సరాల దీర్ఘకాలిక కోర్సును అందజేస్తున్నామని తెలిపారు. ఏఎస్ రావునగర్ బ్రాంచ్‌ను ఏఎస్ రావు నగర్, ఈసీఐఎల్, దమ్మాయిగూడ, కుషాయిగూడ, నాగారం, ఘట్కేసర్, కీసర తదితర ప్రాంత విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకాష్ ఇనిస్టిట్యూట్స్ రీజినల్ సేల్స్ అండ్ గ్రోత్ హెడ్ భరత్ మండడి, దక్షిణ ప్రాంతీయ కార్యకలాపాలు నిశాంత్ శ్రీవాస్తవ, సెంటర్ హెడ్ దీపక్ కుమార్ తులా, ఎడి అకాడమిక్స్ కె.వి రామంజనేయులు, ఏరియా సేల్స్ హెడ్ కె.వి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పేట్, చందానగర్, భారతినగర్ (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 193 మంది లబ్దిదారులకు 1,93,22,388 ఒక కోటి తొంభై మూడు లక్షల ఇరవై రెండు వేల మూడు వందల ఎనభై ఎనిమిది రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్ రెడ్డి, నార్నె శ్రీనివాసరావుతో కలిసి చెక్కులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఈ రోజు 193 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది అని, ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారు అని కొనియాడారు. నిరుపేదల అడా బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా, మానవతా దృక్పథం తో కల్యాణలక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగినది అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్లలో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ఎంత గానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో గ్లో బై కీర్తిలాల్స్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హౌస్ ఆఫ్ కీర్తిలాల్స్ నుండి, సమకాలీన డైమండ్ గోల్డ్ జ్యువెలరీ బ్రాండ్ అయిన "గ్లో బై కీర్తిలాల్స్", హైదరాబాదు లోని జూబ్లీ హిల్స్‌లో తన సరికొత్త ప్రత్యేక షోరూమ్ ను ప్రారంభించింది. ఈ షోరూమ్ ప్రారంభం తో భారతదేశం అంతటా బ్రాండ్ పెరుగుతున్న ఉనికికి ప్రతీకగా ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ అన్నారు. వ్యూహాత్మకంగా హైదరాబాద్ అత్యంత ఉన్నతమైన పరిసరాలలో ఒకటైన, కొత్త "గ్లో బై కీర్తిలాల్స్" షోరూమ్ బ్రాండ్ సిగ్నేచర్ ఆభరణాలను, సొగసైన, తేలికపాటి సహజ వజ్రం బంగారు ఆభరణాలను, ఆధునిక పట్టణ ఖాతాదారులకు అందిస్తుందన్నారు. ఈ షోరూమ్, నేటి ఆధునిక మహిళ శైలి సున్నితత్వాలను ప్రతిబింబించేలా రూపొందించబడిందన్నారు. ఈ కొత్త దుకాణం రోజువారీ దుస్తులు ధరించే సామర్థ్యాన్ని కాలాతీత విలాసాలతో సజావుగా మిళితం చేసే సేకరణలను ప్రదర్శిస్తుందన్నారు. "గ్లో బై కీర్తిలాలను జూబ్లీ హిల్స్‌లో విస్తరించడంతో బ్రాండ్ ఫిలాసఫీని సంపూర్ణంగా పూర్తి చేసే డైనమిక్ ట్రెండ్ సెట్టింగ్ ప్రాంతంగా నిలుస్తుందని చెప్పారు. మహిళలు వారి జీవనశైలికి తగిన ఆభరణాలను కనుగొనగల గమ్యాన్ని అందించడంలో తాము ముందున్నామన్నారు. గ్లో బై కీర్తిలాల్స్ అనేది హౌస్ ఆఫ్ కీర్తిలాల్స్ క్రింద సమకాలీన వజ్రాలు బంగారు ఆభరణాల బ్రాండ్, ఇది 85 సంవత్సరాలకు పైగా చక్కటి హస్తకళలో వారసత్వానికి ప్రసిద్ధి చెందిందని తెలిపారు.

ఆరెకపూడి గాంధీ చొరవతో చెరువులకు మహర్దశ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మియపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు, గుర్నాథమ్, మక్తా మహబూబ్ పెట్‌లోని పెద్దకుడి చెరువు, సుందరికరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ, ఐసీయుఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల వారి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలో భాగంగా సుందరికరణ, పునరుద్ధరణ పనులను జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకువస్తామని, చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసిపడదామని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే నా ధ్యేయంగా పనిచేస్తానని,చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయి. జీవ వైవిధ్యం పెరుగుతుంది. పక్షులు వలసలు మొదలు అవుతాయి అని, చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు కనబడే దేవుళ్ళతో సమానమని తెలిపారు. మియపూర్‌లో అన్ని చెరువులకు సుందరికరణ భాగ్యము కలిగినది. త్వరలోనే మియపూర్ రూపురేఖలు మారునని దశ దిశ మారింది అని ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే నా లక్ష్యమన్నారు. చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మస్జిద్ ఎ ఆసరా మల్కాజిగిరిలో మస్జిద్ ఎ ఆసరా కమిటీ మల్కాజిగిరి ముస్లిం యువత తరుపు నుండి వక్ఫ్ బిల్లు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం శాంతి యుతంగా నిరసనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పరిసర ప్రాంతాల నుండి మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీపీఐ మాజీ ఎంపీ అజీజ్ పాషా, మునావర్ అలీ, నసీరుద్దీన్ లాలాగూడ మసీదు కమిటీ ప్రెసిడెంట్ తమ వాణి వినిపించారు.

మస్జిద్ ఆసరా మల్కాజిగిరి కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ అహ్మద్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ శాంతియుతంగా నిర్వహించడానికి సహకరించిన పోలీస్ విభాగం సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మున్సిపల్ కార్మికులపై అంత వివక్ష ఎందుకు...

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పడ మున్సిపల్ పాలక వర్గం సమయం మూగయడం వల్ల నేరుగా మున్సిపల్ నుండి బ్యాంకులో పడవలసిన మున్సిపల్ కార్మికుల జీతాలు ఆలస్యం అవుతున్నందుకు ఈ రోజు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే కార్మికుల జీతం వెంటనే వెయ్యాలని నిరసన తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే సిబ్బందికి, ఉద్యోగులకు ప్రతి నెల ఏడవ తేదీన పడవలసిన జీతాలు ఇప్పడి వరకు పడక పోవడంతో బాధాకరం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పడ మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం సమయం ముగిసిన సందర్భంగా మున్సిపల్ నుండి నేరుగా బ్యాంక్‌కు పోవలసిన జీతాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కోశాధికారి వద్దకు వెళ్లి రావడం వల్ల ఆలస్యం జరుగుతుందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి కార్మికులకు జీతాలు ఇవ్వాల్ని వారు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గయ్య, యాదయ్య, నర్సమ్మ, సత్తమ్మ, యాదమ్మ, పుషమ్మ, కృష్ణ, రాజు, నాగయ్య, జీతయ్య పాల్గొన్నారు.

చలో వరంగల్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మేడిపల్లి: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న వేడుకలకు సంబందించిన వాల్ పోస్టర్ను శుక్రవారం ఉదయం మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 నెలల నుంచి కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చింది. కాంగ్రెస్ వచ్చింది నీళ్లు బంద్ అయినాయి. కాంగ్రెస్ వచ్చింది కరెంటు పోయింది. కాంగ్రెస్ వచ్చింది రియల్ ఎస్టేట్ మొత్తం కుప్పకూలిపోయిందంటూ ఏద్దెవా చేశారు. కేసీఆర్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని ప్రజలు కాంగ్రెస్, మాయమాటలను నమ్మి మోసపోయామని ఇప్పుడు మళ్ళీ కెసిఆర్, కేటీఆరే కావాలంటున్నారని, ఈనెల 27న వరంగల్ బీఆర్ఎస్ పార్టీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకుల లేతాకుల రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, ప్రభు, ఆంజనేయులు, బాలరాజు, వెంకట్, యాసారం మహేష్, జోగిరెడ్డి, శంకర్, రాజశేఖర్, సతీష్, మల్లం వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 రద్దు చేసి మళ్ళీ నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ యువతకు అందులో ముఖ్యంగా నిరుద్యోగులకు అనేక ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వారి జీవితాలతో చెలగాటమాడుతున్న తీరు ఆక్షేపనీయం అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది నిరుద్యోగుల జీవితాలు అగాథంలోకి నెట్టివేయబడ్డాయని విమర్శించారు. శుక్రవారం గ్రూప్-1 పరీక్ష అంశాన్ని ప్రస్తావిస్తూ ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ వ్రాశారు. ఈ సందర్భంగా గ్రూప్-1 పరీక్ష నిర్వహించిన తీరు, ఫలితాల వెల్లడిలో అనేక లోపాలు, అవకతవకలు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదంటే పారదర్శకంగా ఉద్యోగ నియామకాల పట్ల మీకు ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమవుతుందని దుయ్యబట్టారు. గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు ఒక హాల్ టికెట్ ఇష్యూ చేసిన టీజీపీఎస్సీ అధికారులు, మెయిన్స్ పరీక్షకు వేరే హాల్ టికెట్ జారీ చేశారని తెలిపారు. గ్రూప్-1 పరీక్షలపై పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన తెలంగాణ హైకోర్టు తాము తుది ఆదేశాలు ఇచ్చే వరకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు ఇవ్వొద్దని కీలక ఆదేశాలు జారీ చేసిందన్నారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ప్రిలిమ్స్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులను 1 : 50 నిష్పత్తిలో ఎంపిక చేశామని టీజీపీఎస్సీ ప్రకటించిందని, వారిలో 21,075 మంది మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల అనంతరం ప్రకటన చేసిందన్నారు. కాని ఫలితాలు ప్రకటించే సరికి ఆ అభ్యర్థుల సంఖ్య 21,085 మందికి చేరింది, అంటే మెయిన్స్ పరీక్షకు హాజరయ్యారని చెప్తున్న వారి సంఖ్య పదికి పెరిగిందని, ఈ పెరిగిన పది మంది ఎక్కడి నుంచి వచ్చారనే సందేహాలు అభ్యర్థుల్లో నెలకొన్నాయన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 45 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించిన టీజీపీఎస్సీ తర్వాత ఒక సెంటర్ పెంచి 46 కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించిందన్నారు.

నీలాంబరి శిల్క్స్‌ను ప్రారంభించిన నటి సంయుక్తామీనన్

విశాలాంధ్ర - కాప్రా : కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని సాకేత్ మెయిన్ రోడ్ భవాని నగర్‌లో నీలాంబరి పట్టు బ్రహ్మాండం సిల్క్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా సినీ తార సంయుక్తా మీనన్, ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. యువత స్వయం ఉపాధి కోసం కృషి చేయాలని అన్నారు. నిర్వాహకులను వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - అమనగల్లు : రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమనగల్లు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, తలకొండపల్లి పి.ఏ.సి.ఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు పండిస్తున్న రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా కొత్తరేషన్ కార్డులను త్వరలో అందజేయున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అజీమ్, తాళ్ళ రవీందర్, సంపత్ కుమార్, అంజయ్య గుప్తా, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కండె పాండు రంగయ్య, రవీందర్, యాదయ్య, రమేష్, నరేష్ నాయక్, జంగయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్లమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ధనుంజయ, మాజీ సర్పంచ్ గుర్రం కరుణ కేశవులు, అప్పం శ్రీను, అబ్దుల్ ఖాదర్, ఖాదర్ ఖాద్రి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎంగలి ప్రసాద్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, సోషల్ మీడియా కన్వీనర్లు దేవరశెట్టి మహేష్, నాజర్, కొప్పు విజేందర్, పులి కంటి మైసయ్య, షాబుద్దీన్, సురేష్ నాయక్, దుద్దు కృష్ణ యాదవ్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా భూదాన ఉద్యమ వజ్రోత్సవాలు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మహాత్మా గాంధీ ఆధ్యాత్మిక వారసుడు ఆచార్య వినోబా భవే చేపట్టిన స్వరాజ్యం, సర్వోదయ ఉద్యమాలలో భాగంగా భూమిలేని గ్రామీణ నిరుపేదలను సాధికారతను తీసుకరావడం కోసం ఏప్రిల్ 18, 1951 సంవత్సరంలో తెలంగాణలోని పోచంపల్లిలో భూదాన ఉద్యమం ప్రారంభించబడి దేశవ్యాప్తంగా విస్తరించబడి, 75 సంవత్సరాల సందర్భంగా దేశవ్యాప్తంగా సంవత్సరంపాటు వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నామని అఖిల భారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం మహారాష్ట్రలోని కొల్హాపూర్ పట్టణంలో భూదాన ఉద్యమం వజ్రోత్సవాలను ప్రారంభిస్తున్నామని, అనంతరం ఏడాదిపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, జిల్లాలో జరుగుతాయని, 2025 జులై 17న హైదరాబాద్‌లో లక్షమందితో ఈ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అయన ప్రకటించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత సర్వోదయ మండలి నిర్వహించిన సమావేశంలో భూదాన భూదాత వెదిరె రామచంద్రారెడ్డి కొడుకు వెదిరె ప్రోమోతిష్ చంద్రరెడ్డి, అఖిల భారత సర్వసేవ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుతో లుపునురి కృష్ణగౌడ్‌లతో కలసి వెదిరె అరవింద్ రెడ్డి మాట్లాడుతూ ఆచార్య వినోబా భవే పోచంపల్లిలో భూదాన ఉద్యమాన్ని ప్రారంభించిన అనంతరం మొదటి ప్రయత్నంగా మామ తాత సామాజిక కార్యకర్త, భూస్వామి వెదిరె రామచంద్రా రెడ్డిని కలిసి భూమిని దానం చేయమని అభ్యర్థించగా, వెంటనే స్పందించి మొదటగా 100 ఎకరాలు ఆతరువాత 800 ఎకరాలు, చివరకు 100 ఎకరాలు, మొత్తం 1000 ఎకరాలు దానం చేసారని గుర్తు చేశారు. వెదిరె ప్రోమోతిష్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూదాన భూముల లెక్కతేల్చి, అక్రమార్కులనుండి వాటిని స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంచాలని, వెదిరె రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల పేర్లు చెప్పి కబ్జాలకు పాల్పడుతున్న ముఠాలపై కఠిన చెర్యలు తీసుకోవాలని కోరారు. కోట్ల రూపాయల విలువ చేసే భూదాన భూములు అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేసి రాష్ట్రంలోని నిరుపేదలకు పంపిణి చేయాలనీ తోలుపునురి కృష్ణ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

20న జీ తెలుగులో కామెడీ ఎంటర్‌టైనర్ మజాకా

విశాలాంధ్ర - మహబూబ్‌నగర్: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ వారం మరో సూపర్ హిట్ సినిమాతో వచ్చేస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్, అన్షు సాగర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మజాకా' సినిమాని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోందన్నారు. ఈ సినిమా కథ విశాఖపట్నంలో సాధారణ జీవితాన్ని గడిపే కృష్ణ (సందీప్ కిషన్), అతని తండ్రి వెంకట రమణ (రావు రమేష్) చుట్టూ తిరుగుతుందన్నారు. తండ్రీకొడుకులు ఎవరికి వారు పెళ్లి చేసుకోవాలన్న సరదా సన్నివేశాలు, వారి జీవితాల్లోకి ప్రవేశించిన మీరా (రీతూ వర్మ), యశోద (అన్షు సాగర్) పాత్రలు, వారి వివాహాలు ఎలా జరుగుతాయనే విషయాలు తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే మజాకా సినిమా తప్పకుండా చూడాల్సిందేనని అన్నారు. మజాకా కామెడీ ఎంటర్‌టైనర్‌గా థియేటర్లలో ప్రేక్షకులను మెప్పించింది. ఈ సినిమాలోని హృదయాలను హత్తుకునే సన్నివేశాలు, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్, అన్షు సాగర్ ప్రధాన పాత్రలు పోషించగా మురళీ శర్మ, హైపర్ ఆది, శ్రీనివాస్ రెడ్డి ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు.

ఇండియన్ ఆయిల్‌కు స్కోచ్ గోల్డ్ అవార్డ్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఇండియన్ ఆయిల్ ప్రముఖ ఎక్స్‌ట్రాపవర్ ఫ్లీట్ కార్డ్ లాయల్టీ ప్రోగ్రామ్‌కు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ - బిజినెస్ ప్రాసెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో స్కోచ్ గోల్డ్ అవార్డు 2025 లభించింది. ఈ పురస్కారాన్ని వందో స్కోచ్ సమ్మిట్ సందర్భంగా స్కోచ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అధ్యక్షులు సమీర్ కోచర్ ఇండియన్ ఆయిల్ బృందానికి అందజేశారు. రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో వినియోగదారులకు అనుకూలమైన డిజిటల్ పరిష్కారాలు అందించడంలో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఇచ్చారు. ఫ్లీట్ ఆపరేటర్ల కోసం రూపొందించిన ఈ ప్రోగ్రామ్ ఇంధన నిర్వహణను సురక్షితంగా, సులభంగా, పారదర్శకంగా చేసే సాంకేతిక వేదికగా విస్తరించింది. ఎక్స్‌ట్రాపవర్ ఫ్లీట్ కార్డ్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా లక్షలాది ఫ్లీట్ ఆపరేటర్లకు విశ్వసనీయ పరిష్కారంగా కొనసాగుతోంది. రియల్ టైమ్ నియంత్రణ, అదనపు లాభాలు, వినియోగంలో పారదర్శకత తదితర లక్షణాలు ఈ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక పురస్కారాలలో ఒకటిగా స్కోచ్ అవార్డులు నిలిచాయి. ఇవి పాలన, ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, సామాజిక రంగాల్లో విశిష్టతను గౌరవిస్తాయి. ఇండియన్ ఆయిల్ ఎంపిక నియమిత దశల మూల్యాంకన ప్రక్రియలోని చివరి ప్రవేశ ప్రదర్శన మార్చి 11, 2025న జరిగింది. ఈ సంవత్సరం ఈ అవార్డుల కోసం ప్రముఖ బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, సాంకేతిక కంపెనీలు, ప్రైవేట్ రంగ సంస్థలు పాల్గొన్నాయి.

ప్రపంచ వారసత్వ దినోత్సవం పురస్కరించుకొని

'హైదరాబాద్ హెరిటేజ్ వాక్'

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ప్రపంచ వారసత్వ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఫర్ మోనుమెంట్స్ అండ్ సైట్స్) సందర్భంగా శుక్రవారం డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో, పురావస్తు శాఖ (ఏఎస్ఐ) హైదరాబాద్ సర్కిల్, తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (టీఎస్ టీడీసీ), జేబీఆర్ ఏసీ, ఫోరమ్ ఫర్ ఏ బెటర్ హైదరాబాద్, ఇతర పౌర సంఘాల భాగస్వామ్యంతో హెరిటేజ్ వాక్ డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మనికొండ వేదకుమార్ అధ్యక్షతన చార్మినార్ వద్ద ప్రారంభించారు. ప్రొఫెసర్ జి.ఎస్.వి.సూర్యనారాయణ మూర్తి, సౌత్ జోన్ రిప్రెసెంటేటివ్, ఐకామోస్ ఇండియా, డా. జి.జయశ్రీ, ప్రాచీన భారత చరిత్ర, పురావస్తు శాఖ, ఉస్మానియా యూనివర్సిటీ, కోటయ్య వింజమూరి, డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్ట్, ఏఎస్ఐ డా.ఈ.సాయికృష్ణ, అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్, ఏఎస్ఐ, జె.రాజేశ్వరి, కన్సర్వేషనిస్ట్, ఏఎస్ఐ, సాయి రామ్, సుధాకర్, కార్యనిర్వాహకులు, తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎస్.ప్రభాకర్, డీటీఓ, పర్యాటక శాఖ, డి.శ్రీనివాస్, హెరిటేజ్ వాక్ ఇన్‌చార్జ్, డి.శ్యాం సుందర్ రావు, స్థపతి, డా.ద్యావనపల్లి సత్యనారాయణ, క్యురేటర్, తెలంగాణ గిరిజన మ్యూజియం, పి.వీరమల్లు, అధ్యక్షుడు, బౌద్ధ తత్వ ఫౌండేషన్, సిటీ కాలేజ్, జేబిఏఆర్ సీ, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, ఎస్ఆర్డీపి, వాసవి స్కూల్, వైష్ణవి ఆర్కిటెక్చర్ కాలేజ్ విద్యార్థులు, పౌర సంఘాల సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ వారసత్వ సంరక్షణ అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది మన సమాజపు కలసికట్టు బాధ్యతగా భావించాలని సూచించారు.

పార్టీ సభ్యత్వంపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : తెలుగుదేశం పార్టీని తెలంగాణలో అభివృద్ధి చేయాలంటే ప్రధానమైనది సభ్యత్వం. ఈ విషయంలో పార్టీ శ్రేణులు దృష్టి పెట్టి అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహ్మలు సూచించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. సభ్యత్వ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పనిచేయాలని స్పష్టం చేశారు. సభ్యత్వాలు పెంచితేనే పార్టీ బలోపేతానికి అవకాశం ఉంటుందని దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలని కూడా చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు కేతన్రావు, ప్రధాన కార్యదర్శి గూడెపు రాఘవులు, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్గని యాదయ్య గౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పోరేటర్

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ పరిధిలోని, సూర్యనగర్ కాలనీలోని రోడ్ నెంబరు 3 లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజి పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ వాసులు డ్రైనేజి పైపు లైను మరో 40 మీటర్ల మేర పొడిగుంపు అవసరమని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే 40 మీటర్ల డ్రైనేజి లైను పొడిగింపు కొరకు సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐడియల్ కిచెన్‌ను ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి హనుమాన్ టెంపుల్ సమీపంలో చంద్రకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నూతనంగా ఏర్పాటు చేయబడిన ఐడియల్ కిచెన్ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్ హాజరై రిబ్బన్ కట్‌చేసి కిచెన్‌ను ప్రారంభించారు. మాజీ మేయర్ అమర్‌సింగ్ ఐడియల్ కిచెన్ యజమాని చంద్రకాంత్‌ను వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా ప్రారంభమైన ఈ కిచెన్ విజయవంతంగా, అభివృద్ధి చెందుతూ కొనసాగాలని, ఇలాంటి మరిన్ని కిచెన్స్ ఏర్పాటు చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి, మాజీ మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు భీమ్ రెడ్డి, నవీన్‌రెడ్డి, సుభాష్ నాయక్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పప్పుల అంజిరెడ్డి, కుర్ర శ్రీకాంత్, బుచ్చి యాదవ్, గడ్డం రాంరెడ్డి, యాసారం మహేష్, శ్రీనివాస్ రెడ్డి, ఆకుల మధుకర్, రాజారాజు, కొల్తూరి సాయి, మద్ది కిషోర్, సక్రు నాయక్, స్థానిక కాలనీ వాసులు, ఐడియల్ కిచెన్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు కట్టించటమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని పేదలందరికీ అన్ని సౌకర్యాలతో ఇళ్లు నిర్మించటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయిన ఎం.శివప్రసాద్ శుక్రవారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి పార్థసారధిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి గృహ నిర్మాణ శాఖలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలపై ఎండీతో చర్చించి దిశానిర్దేశం చేశారు. జూన్ నాటికి నిర్దేశించిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని శివప్రసాద్ మంత్రికి వివరించారు. అధికారులంతా ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ తీరు పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి: నరసింహ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: హిందుత్వంపై దాడులు చేసిన వ్యక్తులే నేడు దేవాలయాల ప్రతిష్ట గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా... దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. టీటీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుపై ఏకవచనంతో మాట్లాడిన రోజా... వెంటనే యాదవ సామాజిక వర్గానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... అబద్దాలతో కరుణాకర్ రెడ్డి చేసిన సవాల్‌ను నిలబెట్టుకోలేక దొంగ నాటకాలతో తోకముడిచారని విమర్శించారు.

ప్రజల మనోభావాలతో ఆటలా?

టీటీడీపై రాజకీయాలు ఆపండి

నేతలకు నారాయణ హితవు

విశాలాంధ్ర-తిరుపతి: టీటీడీపై ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని, అటువంటి చోట రాజకీయాలు తగదని వివిధ రాజకీయ పార్టీలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ హితవు పలికారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసి లబ్ధిపొందేలా పరస్పర ఆరోపణలకు ఇక ఫుల్ స్టాప్ పెట్టాల్సిందిగా ఆయన కోరారు. శుక్రవారం తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గోశాల విషయాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకోవద్దని, అందుకోసం తాను సదరు నేతలను చేతులు జోడించి కోరుతున్నానన్నారు. హైడ్రామాలు సృష్టించి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని, టీటీడీపై ఇంతటితో రాద్ధాంతం మానుకోవాలని హితవు పలికారు. తిరుపతి, తిరుమలపై ఇలాంటి రాద్ధాంతం సరికాదని, అదే కొనసాగితే టీటీడీ ప్రతిష్ట దిగజారే అవకాశం ఉందన్నారు. కాగా గురువారం ఉపరాష్ట్రపతి జగదీశ్ ధన్కర్ వ్యాఖ్యలను ఖండించారు. న్యాయవ్యవస్థను ధ్వంసం చేసేలా బీజేపీ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులను గవర్నర్ లుగా చేసి రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని మండిపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్ లదే పెత్తనంగా మారిందన్నారు. గవర్నర్ ల నిర్ణయాలపై వివిధ రాష్ట్రాల సీఎంలు సుప్రీంను ఆశ్రయించినట్లు వివరించారు. గవర్నర్ ల వ్యవహార శైలిని సుప్రీం కోర్టు తప్పుబట్టిందని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పును ఉపరాష్ట్రపతి ఆక్షేపించడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ పై వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్ మెంట్ పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రీయంబర్స్ మెంట్ ఆలస్యమైతే ప్రభుత్వానిది క్రిమినల్ చర్యగా భావిచాలన్నారు. లక్షల మంది విద్యార్థుల గొంతునొక్కే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఇకనైనా విద్యార్థుల రీయింబర్స్ మెంట్ పట్ల ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధన్కర్‌పై విమర్శల దాడి

తీర్పు వ్యతిరేకమైతే విమర్శలా

ఇందిరాగాంధీ ఎన్నిక రద్దు గుర్తులేదా: సిబల్

ఉప రాష్ట్రపతి తీరు అనైతికం: మనోజ్ ఝా, తిరుచీ శివ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా వస్తే పొగుడుతారు... లేకపోతే విమర్శిస్తారా అంటూ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ తీరును ప్రతిపక్ష పార్టీల ఎంపీలు దుయ్యబట్టారు. తమిళనాడు గవర్నర్ పెండింగ్ పెట్టిన బిల్లుల ఆమోదానికి న్యాయపరంగా మార్గం సుగమం చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయడం, దీనిపై ధన్కర్ విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అత్యున్నత పదవుల్లో ఉన్న వారు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశంలో మునుపెన్నడూ జరగలేదని సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని నాడు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సిబల్ గుర్తుచేశారు. నాటి తీర్పు ఆమోదయోగ్యమే అయితే తాజా తీర్పు ఎందుకు కాదని ధన్కర్‌ను ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 142వ అధికరణ ద్వారా సుప్రీం కోర్టుకు ప్రత్యేక అధికారాలు వర్తిస్తాయని, ఆ అధికరణ ప్రజాస్వామ్య వ్యవస్థలపై అణు క్షిపణిలా వినియోగమవుతోందని ధన్కర్ ఆరోపించడాన్ని ఆక్షేపించారు. ధన్కర్ వ్యాఖ్యలు అనైతికమని ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కే ఝా, డీఎంకే ఎంపీ తిరుచీ శివ ఖండించారు. ఎగ్జిక్యూటివ్ (పరిపాలన), లెజిస్లేచర్ (చట్టసభ), జ్యుడిషియరీ (న్యాయవ్యవస్థ)తో పాటు మీడియా... ప్రజల విషయంలో సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కపిల్ సిబల్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధన్కర్ వైఖరి తనను బాధించిందని, ఆశ్చర్యపరిచిందని అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పులు అనుకూలంగా ఉంటే ప్రశంసలు కురిపించడం... లేకపోతే న్యాయ వ్యవస్థపై దుమ్మెత్తిపోయడం ప్రభుత్వ అధికారులలో కొందరికి పరిపాటైందన్నారు. న్యాయ వ్యవస్థలపై దాడి చేయడం, తీసిపారేయడం సరి కాదని... న్యాయ వ్యవస్థను, రాజ్యాంగాన్ని విశ్వసించాలని, న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపత్తి కలిగి ఉండటం ప్రజాస్వామ్యంలో ప్రాథమికమని సిబల్ నొక్కిచెప్పారు. లేని పక్షంలో అన్ని హక్కులకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రజలంతా విశ్వసించేది న్యాయ వ్యవస్థ ఒక్కటేనన్నారు. అయోధ్య కేసు లేక అధికరణ 370 రద్దు సమయంలో మోదీ ప్రభుత్వ చర్యలను కొందరు విమర్శించినప్పుడు... సుప్రీంకోర్టు తీర్పులు అనుకూలంగా రావడంతో వాటిని మెచ్చుకున్న వారు ఇప్పుడు బిల్లుల ఆమోదానికి గడువు నిర్దేశిస్తూ గవర్నర్లు, రాష్ట్రపతికి సూచనలు చేసిన సర్వోన్నత న్యాయస్థానాన్ని విమర్శిస్తున్నారని సిబల్ అన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 142ను 'అణు క్షిపణి'గా ధన్కర్ వ్యాఖ్యానించడాన్ని ఆక్షేపించారు. సుప్రీంకోర్టుకు అలా అధికారాలు ఇచ్చింది రాజ్యాంగం... ప్రభుత్వం కాదని అన్నారు. 'రాష్ట్రపతి పదవి... అత్యున్నత హోదా అయినప్పటికీ, మంత్రివర్గం సలహాల మేరకు రాష్ట్రపతి నడుచుకోవాలి. సొంతంగా నిర్ణయాలు తీసుకొనే అధికారం ఉండదు. జగదీప్ ధన్కర్‌కు ఈ విషయం తెలియదా!' అని కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ పదవుల్లో ఉన్న వారు పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని, ఏ ఒక్క పార్టీకి అధికార ప్రతినిధిగా ఉండరాదన్నారు. 1975లో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు వచ్చిందని, ఆ తీర్పు ఇచ్చినది జస్టిస్ కృష్ణ అయ్యర్ నేతృత్వ ఏకసభ్య ధర్మాసనం అని సిబల్ అన్నారు. ఆ తీర్పుతో ఇందిరా గాంధీ సీటు కోల్పోయారని గుర్తు చేశారు. 1975లో ఎమర్జెన్సీ, 1984లో సిక్కుల వ్యతిరేక అల్లర్లు గురించి మాట్లాడే ఉప రాష్ట్రపతి... మోదీ సీఎంగా ఉండగా జరిగిన 2002 గుజరాత్ అల్లర్ల గురించి ఎందుకు మాట్లాడలేదని ధన్కర్‌ను నిలదీశారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు వ్యవహారంలో ఎఫ్‌ఐఆర్ ఎందుకు నమోదు కాలేదు? అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ మతతత్వ వ్యాఖ్యలు చేసినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని కపిల్ సిబల్ ప్రశ్నించారు.

విత్తనాలపై విదేశీ కంపెనీల ఆధిపత్యం ప్రమాదకరం

జాతీయ సదస్సులో ప్రముఖులు

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రకృతిలోని జీవవైవిధ్యంతో రైతుల జీవన సరళి ముడిపడి ఉందని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సోమ మర్ల అన్నారు. హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'విత్తన సార్వభౌమత్వం-జన్యునిధిపై రైతుల హక్కులు' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సోమ మర్ల మాట్లాడుతూ... అనాదిగా ప్రకృతిలో ఉండే పాత విత్తనాల భద్రతలో రైతుల పాత్ర ప్రధానమైందన్నారు. దీనివల్ల జన్యునిధి (సీడ్ బ్యాంక్) నిర్వహణలో చిన్న రైతులకు ప్రధాన పాత్ర నివ్వాలని, విత్తనాలపై ప్రైవేట్ విత్తన కంపెనీల ఆధిపత్యాన్ని నిరోధించాలని కోరారు. ప్రముఖ వ్యవసాయరంగ విశ్లేషకుడు డాక్టర్ సుమన్ సహాయ్ మాట్లాడుతూ... ప్రభుత్వం రెండవ జన్యు బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. శ్రేష్ఠమైన విత్తనాలు... నేలలో సేద్యం ముడిపడి ఉందన్నారు. ప్రైవేట్ కంపెనీలకు, విదేశీ బహుళజాతి సంస్థలకు విత్తనాలపై ఆధిపత్యాన్ని నిరోధించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శరత్‌బాబు మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర, తూర్పు తెలంగాణలో కొన్ని రైతు విత్తన బ్యాంకులు (సామూహిక విత్తన కేంద్రాలు) లాభాపేక్షతో కాకుండా ఇచ్చి పుచ్చుకునే విధానాలతో రైతుల విత్తన అవసరాలను తీరుస్తున్నాయన్నారు. ఈ విత్తన సంస్థలకు ఐసీఆర్, ప్రభుత్వం... సాంకేతిక, ఆర్థిక సహకారం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సలహా మండలి సభ్యుడు, ఇక్రిశాట్ శాస్త్రవేత్త డాక్టర్ కులదీప్‌సింగ్ మాట్లాడుతూ...విత్తన భద్రతకై వివిధ ప్రభుత్వరంగ వ్యవసాయ పరిశోధనా సంస్థలు చేస్తున్న కృషిని వివరిస్తూ... రైతుల విత్తన అవసరాలను తీర్చడానికికే ప్రైవేట్ భాగస్వామ్యంతో రెండవ విత్తన జన్యు బ్యాంక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదన్నారు. ప్రముఖ వ్యవసాయ ప్రధాన విశ్లేషకుడు, కిసాన్ మజ్దూర్ కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ దినేష్ అబ్రోల్ మాట్లాడుతూ... విత్తన రంగంపై ఆధిపత్యాన్ని ప్రైవేటు, బహుళజాతి కంపెనీలకు అప్పగిస్తే... దేశంలో విత్తన వైవిధ్యం, భద్రతకు భంగం కులుగుతుందని పేర్కొన్నారు. మోన్‌సాంట్ కంపెనీ ప్రవేశపెట్టిన జన్యు మార్పిడి పత్తి విత్తనాల ప్రవేశంతో దేశీ పత్తి రకాలు అంతరించిపోవడమేకాక, రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ప్రముఖ గ్రామీణరంగ ప్రధాన విశ్లేషకులు పాలగుమ్మి సాయినాథ్ మాట్లాడుతూ... విదేశీ బహుళజాతి విత్తన కంపెనీల ప్రవేశంతో అనేక రాష్ట్రాల్లో రైతుల ఆర్థికస్థితి క్షీణించిందని, దేశంలో సగటున రోజుకు 200 మంది రైతులు ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారన్నారు. సాగుభూమి అంతకంతకు తగ్గిపోవడానికి కారణం రైతులు సేద్యాన్ని వదిలి వసల కార్మికులుగా పట్టణాలకు తరలిపోవడమేనని పేర్కొన్నారు. ప్రముఖ రైతు నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ... 1990వ దశకం అనంతరం వ్యవసాయ పరిశోధనల్లో ప్రభుత్వరంగ పరిశోధనలు తగ్గిపోయిన కారణంగా ఈనాడు 80 శాతం ప్రైవేట్ విత్తన కంపెనీల ఆధీనంలోకి చేరాయన్నారు. ప్రభుత్వరంగ పరిశోధన సంస్థలకు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు అధికంగా నిధులు కేటాయించి మంచి విత్తనాలు చిన్న రైతులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. జహీరాబాద్ దక్కన్ సామాజిక విత్తననిధి నుంచి ప్రముఖ దళిత మహిళా రైతు లక్ష్మమ్మ మాట్లాడుతూ... వైవిధ్యంతో కూడిన అనేక రకాల విత్తనాలను రైతులు సేకరించి సామాజిక విత్తన కేంద్రాలలో భద్రపరుచుకుని సీజన్‌లో తమ విత్తన అవసరాలు తీర్చుకుంటున్నారని పేర్కొన్నారు. దేశీ విత్తనాల సాగుతో తమ కుటుంబం ఆర్థికంగానుండటమే కాక ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నామని వివరించారు. ప్రముఖ రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ... విత్తన చట్టాన్ని పార్లమెంట్‌లో 2004లో ప్రవేశపెట్టినా, ప్రైవేట్ విత్తన కంపెనీల ఒత్తిడి కారణంగానే ఇప్పటికీ ఆ చట్టాన్ని ప్రభుత్వం ఆమోదించలేదన్నారు. ప్రముఖ పర్యావరణరంగ నాయకుడు ప్రొఫెసర్ దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ...నకిలీ విత్తనాల వలన రైతులు విపరీతంగా నష్టపోతున్నారని, సత్వరం విత్తన చట్టాన్ని తేవాలని కోరారు. ఈ జాతీయ సదస్సులో స్వామినాథన్ (చెన్నై) సంస్థకు చెందిన ఇజ్రాయిల్‌కింగ్, ఉత్తరాంధ్ర రైతు ద్రవ్యనిధి సంస్థ, సుస్థిర వ్యవసాయ సాగు సంస్థ, దక్కన్ అభివృద్ధి సంస్థలకు చెందని రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఐదు విభాగాలుగా ఏర్పడి వివిధ విత్తన సమస్యలు, చేపట్టాల్సిన విధానాలపై చర్చించారు. విత్తనరంగంపై ప్రైవేట్, విదేశీ బహుళజాతి కంపెనీల ఆధిపత్యం విత్తన సార్వభౌమత్వానికి, ఆహార భద్రతకు, రైతు మనుగడకు ప్రమాదకరమని, విత్తనరంగ పటిష్టతకు ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశోధనలను ప్రోత్సహించాలని, రైతు ప్రయోజనాలకై పార్లమెంట్‌లో విత్తన చట్టాన్ని వెంటనే ఆమోదించాలని తీర్మానించారు. కిసాన్ మజ్దూర్ కమిషన్, ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్, దక్కన్ అభివృద్ధి సంస్థ, జనవిజ్ఞాన వేదిక, ప్రకృతి వ్యవసాయ సంస్థలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి.

డీఎస్సీ వయోపరిమితి 44 ఏళ్లు

- పాత విధానమే అమలు
- కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు
- 47 ఏళ్లకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మెగా డీఎస్సీకి జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్ల వరకు సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వయోపరిమితికి జులై 01, 2024 కటాఫ్ తేదీగా నిర్ధారించారు. ఈ వయోపరిమితి అవకాశం ఈ డీఎస్సీకి మాత్రమే ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 డీఎస్సీలో జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 42 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పొడిగించారు. ఆ తర్వాత 44 ఏళ్ల వయోపరిమితితో 2018లో డీఎస్సీ నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో 2024లో 44 ఏళ్ల వయోపరిమితితో డీఎస్సీ నోటిఫికేషన్ జారీజేసినప్పటికీ, కోర్టు కేసులు, ఆ తర్వాత వచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌తో అది నిలిచిపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు మొదటి సంతకం డీఎస్సీపై చేశారు. గత ఐదేళ్లపాటు డీఎస్సీ నిలిచిపోవడం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో దాదాపు 10 నెలలు పూర్తయినందున ప్రస్తుత డీఎస్సీకి జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్ల వరకు వయోపరిమితి ఇవ్వాలని అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందించలేదు. పాత విధానం ప్రకారం వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ధారించారు. సీఎం చంద్రబాబు డీఎస్సీ ప్రకటనపై సంతకం చేసే సమయానికే వేలాది మంది అభ్యర్థుల వయోపరిమితి దాదాపుగా 44 ఏళ్ల వరకు ఉంది. అలాంటి వారికి వయోపరిమితి మించిపోయి, దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులవుతారు.

47 ఏళ్లకు వయోపరిమితి పెంచాలి: ఏపీ నిరుద్యోగ జేఏసీ

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచి...అందరికీ అవకాశం కల్పించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్‌కుమార్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ వయోపరిమితిని 44 ఏళ్లకు కొనసాగించి... దాని కటాఫ్‌ను 1 జులై, 2024 వరకు ప్రకటించడం పట్ల మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నోటిఫికేషన్లు సకాలంలో ఇవ్వకపోవడం వల్ల, లక్షలాదిమంది నిరుద్యోగ యువత ఉద్యోగ వయోపరిమితి దాటిపోయారని తెలిపారు. దీనివల్ల డీఎస్సీ అభ్యర్థులు పెద్ద ఎత్తున నష్టపోయారని, వారికి కూటమి ప్రభుత్వం తప్పకుండా ఐదేళ్లపాటు ఉద్యోగ వయోపరిమితి పెంచి జనరల్ అభ్యర్థులకు 47 సంవత్సరాలకు వయోపరిమితి ఈ ఒక్క నోటిఫికేషన్‌కి పెంచి ఇవ్వాలని అభ్యర్థులు ఆశిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2017 లోనే అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో డీఎస్సీ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచినట్లు ఆయన గుర్తుచేశారు. తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని తెలిపారు.

స్వయం సహాయక సంఘాలకు ఇ-వేస్ట్ సేకరణ బాధ్యతలు: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత నాలుగు నెలలుగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిసున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం క్రమం తప్పకుండా ఒక్కొక్క థీమ్‌తో ఈ కార్యక్రమం చేపడుతున్నామని, ఈ నెల 19వ తేదీన 'ఇ - చెక్' అనే థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం నిర్వహించే 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' నిర్వహణకు సంబంధించి మంత్రి దిశానిర్దేశం చేశారు. ఇ- చెక్ అంటే అన్ని మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పూర్తిగా సేకరించి తిరిగి ఉపయోగపడేలా చేయడమని, దీని కోసం మున్సిపాల్టీల్లో ఉన్న ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ఇ-వేస్ట్ కలెక్షన్ సెంటర్లుగా మార్చనున్నట్లు చెప్పారు. ఈ సెంటర్లలో ఇ-వేస్ట్‌ను సేకరించేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ఇళ్లు, దుకాణాల్లో పాడైపోయిన మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఇ-వేస్ట్ కలెక్షన్ సెంటర్లలో ఇవ్వడం ద్వారా వారికి తగినంత నగదు చెల్లిస్తారని, ఇదే సమయంలో మహిళలకు కూడా ఉపాధి కలుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీల్లో మొత్తం 222 ఇ-వేస్ట్ కలెక్షన్ సెంటర్లు అందుబాటులోకి రానున్నట్లు మంత్రి వివరించారు. స్థానికంగా ఉండే మహిళా సంఘాల సభ్యులు కూడా ఇ-వేస్ట్ సేకరించేలా అవకాశం ఉంటుందన్నారు. ఇలా సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించేలా వివిధ కంపెనీలు ముందుకొస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం శనివారం ఒక్క రోజు మాత్రమే కాకుండా ఇ- వేస్ట్ తొలగింపునకు నిత్యం అందుబాటులో కలెక్షన్ సెంటర్లు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. మున్సిపాలిటీ కమిషనర్‌లు ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలని, ఇ-వేస్ట్ కలెక్షన్ కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు.

సహకార ఉద్యమ లక్ష్యాలు నెరవేర్చాలి

రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బ్యాంకులకు పెద్ద మొత్తాల ఎగవేతదారుల్లో రాజకీయ పార్టీలు, నాయకుల హస్తం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సొసైటీల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి సహకార బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, సహకార ఉద్యమం లక్ష్యాలు నెరవేర్చాలని ఆయన సూచించారు. ఏపీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ సమావేశం శుక్రవారం విజయవాడ, లెనిన్ సెంటర్ వద్దనున్న కార్యాలయంలో జరిగింది. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సంఘం వజ్రోత్సవాలపైనా సమీక్షించారు. రామకృష్ణ మాట్లాడుతూ అన్ని సంఘాలు ఏక తాటిపైకి రావడం శుభ పరిణామన్నారు. ఐక్యంగా ఉంటే సమస్యలకు పరిష్కారాలు సాధ్యమన్నారు. రెండంచెల విధానంలో రైతులకు రుణ భారం తగ్గుతుందని, ఈ విధానం అమలు కోసం సీఎంతో చర్చిస్తానని రామకృష్ణ తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మిక ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ఎండగట్టాలన్నారు. ఫెడరేషన్ చైర్మన్ వెలుగురి రాధాకృష్ణ మూర్తి, కార్యదర్శి రవి కుమార్ మాట్లాడుతూ రెండంచెల విధానం అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేచ్చేలా సంతకాల సేకరణ, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్ర నాథ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, బ్యాంకు ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి అక్కినేని రాజా, ప్రతినిధి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాఘవాచారి సంపాదకీయాల ఆవిష్కరణ సభ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్షర శస్త్రధారి, విశాలాంధ్ర రాఘవాచారి సంపాదకీయాలు-నాల్గవ సంపుటి (జాతీయ అంశాలు) ఆవిష్కరణ సభను శనివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. సి.రాఘవాచారి ట్రస్ట్, విజయవాడ అధ్వర్యంలో నిర్వహించే సభకు విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వీ రామారావు అధ్యక్షత వహిస్తారు. సంపుటిని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆవిష్కరిస్తారు. దారి-దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ సభకు పరిచయం చేస్తారు. ఈ సభలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ సందేశాలిస్తారు. ఈ ఆవిష్కరణ సభకు అందరూ సకాలంలో హాజరు కావాలని సి.రాఘవాచారి ట్రస్ట్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

బెట్టింగ్ నిర్మూలనకు సమగ్ర విధానం: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశానికే మోడల్‌గా నిలిచే బెట్టింగ్ వ్యతిరేక సమగ్ర విధానంపై కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌లపై ఒక యూట్యూబర్ 'ఎక్స్' లో పెట్టిన పోస్టులపై మంత్రి లోకేశ్ స్పందించారు. నిరంతర అవగాహన, బెట్టింగ్ యాప్‌లపై కఠిన శిక్షలు, బెట్టింగ్ యాప్‌ల నియంత్రణకు దీర్ఘకాలిక పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ ముప్పును అంతం చేయడానికి అన్ని చట్టపరమైన మార్గాలను అన్వేషిస్తామన్నారు. జూదానికి బానిసైన యువత నిరాశలోకి నెట్టబడిన వందలాది హృదయ విదారక ఘటనలు వింటున్నానని, వీటిని ఆపుతామని స్పష్టం చేశారు. సినీ తారల ప్రచారంతో నిర్వహించే బెట్టింగ్ యాప్‌ల వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయంటూ అన్వేశ్ చిన్ని అనే వ్యక్తి పెట్టిన పోస్ట్‌పై మంత్రి లోకేశ్ ఈ విధంగా స్పందించారు.

కేంద్ర పురావస్తు శాఖ ఆర్‌జేడీ శ్రీలక్ష్మిని కలిసిన జాస్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర పురావస్తు శాఖ వెస్ట్రన్ రీజియన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా అనేక రాష్ట్రాలను పర్యవేక్షిస్తూ విశేష సేవలు అందిస్తున్న తెలుగు అధికారి టి.శ్రీలక్ష్మిని శుక్రవారం ముంబైలోని సియాన్‌లో గల వారి కార్యాలయంలో అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల వెంకటేశ్వర స్వామి వారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించి ప్రపంచ వారసత్వ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రపంచ పర్యాటక కేంద్రాలుగా వెలుగొందుతున్న అమరావతి మహాచైత్యం, మ్యూజియం, నాగార్జునకొండ, లేపాక్షి, గండికోట తదితర చారిత్రక కట్టడాలు, స్మారకాలు, మ్యూజియంల అభివృద్ధి గురించి చర్చించారు. అనంతరం డాక్టర్ జాస్తికి ఆమె శాతవాహనుల కాలం నాటి అద్భుత కట్టడమైన నెల్లూరు జిల్లాలోని గొట్టిప్రోలు చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని బహుకరించారు.

భూమనపై కేసు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతిలోని టీటీడీ ఎస్వీ గోశాలలో గోవుల మృతి పై గత కొన్ని రోజులుగా రాజకీయ రచ్చ కొనసాగుతున్న సంగతి విదితమే. తొలుత టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మీడియా సమావేశంలో టీటీడీ తిరుపతి గోశాల గోవధ శాలగా మారిందంటూ ఆరోపణలు గుప్పించారు. మూడు నెలల కాలంలో 100 గోవులు మృతి చెందాయని చెప్పారు.అదే రోజు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి, భూమన ఆరోపణలు అవాస్తవమని ఖండిచారు. గోశాల పై అసత్య ప్రచారం మానుకోవాలని,నేరుగా వస్తే సాక్షాలతో నిరూపిస్తామన్నారు. ఇక అప్పటి నుండి రోజుకొక అంశంతో వాదోపవాదాలు, సవాళ్లు జోరందుకున్నాయి.ఈ నేపథ్యంలో టీటీడీ పాలకమండలి సభ్యుడు జి.భానుప్రకాష్ రెడ్డి ఇటీవల తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ను కలిసి టీటీడీ ప్రతిష్టను దిగజార్చేలా గోశాల పై అసత్య ఆరోపణలు చేసిన టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పై ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గోశాల పరిధిలోని ఎస్వీయూ పోలీస్ స్టేషన్ లోనూ ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్వీయూ పోలీసులు క్రైమ్ నెంబర్ 62/2025 బి.ఎన్.ఎస్ యాక్ట్ 353(1), 299, 74 ఆఫ్ ఐటీ యాక్ట్ సెక్షన్ ల కింద భూమన పై కేసు నమోదు చేశారు.

మేలో ఐఎస్ఎస్‌కు శుభాంశు శుక్లా

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేపట్టబోయే యాత్ర కోసం ప్రధాన వ్యోమగామిగా గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా ఎంపికయ్యారు. యాక్సియమ్-4 మిషన్‌లో భాగంగా మే నెలలో ఆయన ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్, ఇస్రో పనులపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'గ్రూప్ కెప్టెన్ శుక్లా ప్రయాణం ఎంతో కీలకమైంది. అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ కొత్త శకంలోకి దూసుకెళుతుందనడానికి ఇదో సంకేతం' అని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. మే నెలలో ఈ ప్రయాణం ఉంటుందని, అంతరిక్ష ప్రయోగాల్లో ఇదో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఇస్రో భవిష్యత్తులో చేపట్టనున్న అంతరిక్ష ప్రయోగాలపై సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ ప్రజెంటేషన్ ఇచ్చారు. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్' కోసం ఇస్రో తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి ముందే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి మన వ్యోమగామి పంపించనున్నారు. భారత్-అమెరికా సంయుక్తంగా చేపడుతోన్న ఈ మిషన్‌లో గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను ఇస్రో ఇదివరకే ఎంపిక చేసింది. గగన్‌యాన్‌కు ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ఆయన అతిపిన్న వయస్కుడు కావడం గమనార్హం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.